VISALAANDHRA VIJAYAWADA Phone No. 378

1 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం A 193

విశాలాంధ్ర

70597

సంపుటి 7 * విజయవాడ సోమవారం చైత్రం 24-1880 [ఏప్రిల్ 14-1958] * సంచిక 24

Iris Inks for ALL PENS IN FIVE COLOURS

ఐరిస్ సిరాలు
ఫౌన్‌టెన్ కలాలకు చాలా మంచివి.

తయారు చేయువారు:
Research Chemical Laboratories,
Madras-4, Bangalore-3 New Delhi-1.

కేరళలో ఉపాధ్యాయుల నియామకం

త్రివేంద్రం, ఏప్రిల్ 18

కేరళలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకానికి రెవెన్యూ జిల్లా ప్రాతిపదికమీద సెలెక్షను జరగాలని కేరళ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉద్యోగం పొందడానికి ముందు ప్రతివారూ ట్రైనింగ్ అయివుండాలన్నారు. వెనకబడ్డ జాతులవారికి, నిమ్నజాతులవారికీ ట్రైనింగ్ కాకుండా ఉద్యోగమిస్తే, ఆ తర్వాతనైనా ట్రైనింగ్ పూర్తిచేయాలి.

అంతర్జాతీయ శాంతి స్థాపనకు సామ్రాజ్యవాదాన్ని అంతం చేయడం అవసరం

అమృతసర్ సభలో శ్రీ డాంగే ఉద్ఘాటన

అమృతసర్, ఏప్రిల్ 12

అంతర్జాతీయ శాంతిని నెలకొల్పాలంటే సామ్రాజ్యవాదాన్ని అంతం చేయడం అత్యవసరం అని లోక్‌సభ కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఎస్. ఎ. డాంగే నేటి సాయంత్రం ఇక్కడ అంతర్జాతీయ సౌహార్ద సంఘంవారు ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ చెప్పారు.

సౌహార్దం అనే ముసుగుక్రింద పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాదశక్తులు దుష్ప్రవర్తన సాగిస్తున్నాయి. కాని ఆ సౌహార్దం నిజమైన సౌహార్దంకాదు. అది నిజానికి దుర్బుద్ధి. సామ్రాజ్యవాదులు ఈనాడు శాంతిని గురించి మాట్లాడుతూ అణుయుద్ధానికి సన్నాహాలు చేస్తున్నారు అని శ్రీ డాంగే అన్నారు.

జ్వాలాముఖిలో రష్యావారు రోజుకు ఆరువేల ఖర్చుతో పెట్రోలు తీస్తూవుంటే మరొకచోట అమెరికావారు రోజుకు పాతికవేలు వెచ్చిస్తున్నారని శ్రీ డాంగే అన్నారు. రష్యా సాంకేతిక నిపుణుల పొదుపును ఆయన ప్రశంసించారు.

రష్యావారు భారతదేశానికి రెండున్నర వడ్డీకి అప్పులిస్తే అమెరికావారు ఏడురూపాయలవడ్డీ వసూలుచేస్తున్నారనీ, అయినప్పటికీ భారతదేశానికి రష్యా పెట్టుబడితోపాటు కమ్యూనిజం వస్తుందేమోనన్న భయంతో అమెరికా పెట్టుబడినే కోరుతున్నారనీ శ్రీ డాంగే అన్నారు. ఇది చాలా తప్పుడు దృక్పథం అని ఆయన చెప్పారు.

పెట్టుబడిదారీ విధానాన్ని రద్దుచేయడం ద్వారా దారిద్ర్యాన్ని నిర్మూలించాలని ఆయన అన్నారు. ప్రయివేటు యజమానులు ధనం కూడబెట్టే పద్ధతిని రద్దుచేస్తే దారిద్ర్యం అక్షణంలోనే మటుమాయం అవుతుందన్నారు.

అబ్దుల్లా పై రావల్పిండి పత్రిక విమర్శ

మృదుభాషణ నేర్చుకొమ్మని హితవు

శ్రీనగర్, ఏప్రిల్ 12

షేక్ అబ్దుల్లా తన ప్రతిద్వందులపై అసభ్యభాషలో విమర్శలు చేయరాదని రావల్పిండి (పాకిస్తాన్) వారపత్రిక "ఇన్సాఫ్" ఒక సంపాదకీయం వ్రాస్తూ హితవుచెప్పింది.

దూషణవల్ల దూషణకు గురిఅయినవానికన్న అది చేసినవానికే ఎక్కువ కీడు కలుగుతుందని "ఇన్సాఫ్" వ్రాసింది.

అబ్దుల్లా విడుదలైన దగ్గర నుంచీ మసీదుల్లో సమావేశాలుజరిపి చేస్తున్న దుష్ప్రసంగాలను 'ఇన్సాఫ్' తీవ్రంగా నిరసించింది. ఇది అబ్దుల్లాకు చిరకాలంగా వున్న అలవాటేనన్నది.

రాజకీయ కక్షలలో దూషణవల్ల ఫలితం కలగదు. సద్విమర్శనకూ దూషణకూ ఎక్కడా పొత్తు వుండదు అని ఆ పత్రిక హెచ్చరించింది.

బర్మాకు పోస్టల్ పార్శిళ్లు బంద్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

బర్మా తపాలాశాఖవారి కోరిక మేరకు 1958 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి బర్మాకు వి.పి.లు బంద్ చేసినట్లు భారత తంతితపాలా శాఖ డైరెక్టర్ జనరల్ ఒక ప్రకటన చేశారు. ఇటుపైన బర్మాకు పంపించే వి.పి.లను పోస్టాఫీసుల్లో తీసుకోరు.

ప్రభుత్వోద్యోగుల పోరాటం

ప్రజాతంత్ర పునాదిని బలపరచగలదని శ్రీ పాయ్

గ్వాలియర్, ఏప్రిల్ 12

కేంద్ర ప్రభుత్వోద్యోగులు జరిపే పోరాటాలవల్ల దేశ ప్రజాతంత్ర పునాది గట్టిపడగలదని కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీ నాథ్‌పాయ్ నేడిక్కడ ఆడిట్ అకౌంటుశాఖ అఖిలభారత ఎన్. జి. వోల 28 వ వార్షిక సభలో చెప్పారు.

సమ్మెలూ సత్యాగ్రహాలూ చేస్తేతప్ప ప్రభుత్వం ఒక్క కోర్కెను కూడా మన్నించడం లేదని ఆయన అన్నారు.

సభకుముందు ఉద్యోగులంతా వీధులలో ఊరేగారు.

కొత్త సంవత్సరానికి శ్రీ జి. వి. బెనర్జీ (అలహాబాదు) అధ్యక్షుడుగా, శ్రీ ఎ. వెంకటరామన్, ఎం. కె. వినాయక్ (మద్రాసు) ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

కార్యదర్శులుగా శ్రీ కోసఫ్ (బొంబాయి) కె. బి. పిళ్లే (మధ్యప్రదేశ్), కోశాధికారిగా డా.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం (మైసూరు) ఎన్నికయ్యారు.

అరబ్-సోవియట్ సాంస్కృతిక ఒప్పందం

కైరో, ఏప్రిల్ 10

సోవియట్ యూనియన్, ఐక్య అరబ్ రిపబ్లిక్‌ల మధ్య శాస్త్రీయ, సాంస్కృతిక, విద్యారంగాలలో పరస్పర సహకార సాధనకు దోహదమిచ్చే ఒప్పందంపై నేటి రాత్రి ఇక్కడ సంతకాలు జరిగాయి.

'ఆసియాజాతీయత పశ్చిమ దేశాలకు వ్యతిరేకం కాదు'

అమెరికాలో భారత రాయబారి వెల్లడి

ఫిలడల్ఫియా, ఏప్రిల్ 12

ఆసియాలో జాతీయత పశ్చిమ దేశాలకి వ్యతిరేకంగా లేదని, ఆసియా దేశాలకును పశ్చిమదేశాలతో స్నేహ సంబంధానికి సమానత్వం, ఆత్మగౌరవమూ ప్రాతిపదికలని నేడిక్కడ మాట్లాడుతూ అమెరికాలో భారత రాయబారి శ్రీ జి. ఎల్. మెహతా అన్నారు.

అమెరికా రాజకీయ, సాంఘిక శాస్త్ర సమితి సమావేశంలో మాట్లాడుతూ శ్రీ మెహతా- ఆసియా దేశాల మధ్యనున్న భేదాభిప్రాయాలు శాంతియుతంగా పరిష్కారమవాలన్నారు.

ఆయన యింకా యిలా అన్నారు: పెద్ద జనాభాగల్గి, ఎన్నో రాజకీయావకాశాలు వున్న భారతచైనాలవంటి దేశాలు తమకు దురాక్రమణ ప్రయత్నాలుగాని, దురాక్రమణ అభిప్రాయాలుగాని, లేవని తమ పొరుగుదేశాలకు హామీ యివ్వడం విధాయకం.

నూరుకోట్ల ఆసియా వాసుల జీవితాలు సుఖమయం గానంతవరకూ ఆసియా దేశాల విముక్తి వుద్యమం పరిపూర్ణవంతంకాదని, శ్రీ మెహతా అన్నారు.

దారిద్ర్యంతోను, నిరక్షరాస్యతతోను సతమతమవుతున్న దేశాల్లో ప్రజాతంత్ర వ్యవస్థల్ని నెలకొల్పాల్సివుంటే, ఆ దేశాల ఆర్థికాభివృద్ధి అనేది ప్రభుత్వంయొక్క ప్రాథమిక సమస్యగా వుంటుందని ఆయన అన్నారు.

మహాత్మా గాంధీ నాయకత్వాన పురోగమించిన భారతదేశానికి జాతీయ చైతన్యమనేది వుందని, అయితే పాకిస్తాన్ విషయంలో ఈ చైతన్యం బాగా కొరవడిందనికూడా శ్రీ మెహతా అన్నారు.

* * *

బొంబాయిలో శుక్రవారం సాయంత్రం మౌలానా ఆజాద్ స్మారకార్థం బహిరంగసభ జరిగింది.

ప్రభుత్వ పరిశ్రమల అజమాయిషీ

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీలో చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

ప్రభుత్వ పరిశ్రమలపై అజమాయిషీ సమస్యను గురించి నేడు కూడ కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీలో చర్చలు జరిగాయి. నేటి సమావేశానికి ప్రధాని నెహ్రూ అధ్యక్షత వహించారు.

ఈ అజమాయిషీకి తగు పద్ధతులు సూచించడం కోసం కార్యవర్గం నియమించిన కమిటీని గురించి శ్రీ నెహ్రూ సమావేశంలో చెప్పారు.

ఈ కమిటీలో వాణిజ్య పరిశ్రమల మంత్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి, ఉక్కు ఇంధనాల మంత్రి సర్దార్ స్వర్ణసింగ్, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ మనుభాయిషా కూడా సహకరిస్తారు.

ప్రభుత్వ పరిశ్రమలపై అజమాయిషీకి ఏదో ఒక పద్ధతిని అవలంబించాలని చాగ్లా కమిషన్ చేసిన సూచనను శ్రీ నెహ్రూ ప్రస్తావించి, ఈ విషయంలో తొలిచర్యగా ఈకమిటీని నియమించామని చెప్పారు. పరిశ్రమలపై పార్లమెంటు అజమాయిషీ ఎలావుండాలో ఈ కమిటీవారు నిర్ణయిస్తారు. దాన్నిబట్టి ఒక విధానాన్ని ఏర్పరుస్తామనీ శ్రీ నెహ్రూ చెప్పారు.

చర్చ సందర్భంలో మాజీ ఆర్థికశాఖమంత్రి శ్రీ అరుణచంద్రగుహ మాట్లాడుతూ ఈ కమిటీవారు పరిశ్రమలు ప్రభుత్వ వాణిజ్యసంస్థల వ్యవహారాలనే కాక వివిధ సెస్సులు, టీబోర్డుల వ్యవహారాన్ని కూడా పరిశీలించాలని సూచించారు.

ఈ సంస్థల నిర్వాహకులకు కార్మికులతో సత్సంబంధాలుండాలని శ్రీ జోకిం ఆల్వా సూచించారు. వీటిలో ప్రయివేటు పెట్టుబడి నూటికి 40 వంతులవరకూ వుండేలాగ అనుమతించాలనీ, సంస్థలపై అజమాయిషీ మాత్రం ప్రభుత్వము వుంచుకోవాలనీ శ్రీ రామేశ్వరరావుగారు సూచించారు. దీనివల్ల ప్రయివేటు పెట్టుబడి సత్ఫలితాలనిస్తుందన్నారు.

సంస్థల దైనందిన నిర్వహణలో నిర్వాహకులకు సంపూర్ణస్వాతంత్ర్యం వుండాలనీ, పార్లమెంటుకు వాటిపై అజమాయిషీ మాత్రమే వుండాలనీ శ్రీ జగన్నాథరావు సూచించారు. ఈ సంస్థలలో వ్యాపారస్తుల్ని కూడా నియమించడం అవసరం అన్నారు. అయితే వారికి ఉన్నత స్థానాలు మాత్రం ఇవ్వరాదన్నారు.

ఈ సమస్యను పరిశీలించడం కోసం ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించాలని శ్రీ తిరుమలరావుగారు సూచించారు. ప్రభుత్వసంస్థల నిర్వహణకు నియమితులైన వారిని ఆయన విమర్శించారు.

కమిటీవారి నివేదిక వచ్చిన తర్వాత ఈ సమస్యపై తిరిగి చర్చలు సాగించవచ్చునని ప్రధానినెహ్రూ చర్చలను ముగిస్తూ చెప్పారు.

హాకీ ఆటగానికి ప్రభుత్వ విరాళం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

ప్రముఖ హాకీ ఆటగాడు శ్రీ రూప్‌సింగ్‌కి కేంద్ర ప్రభుత్వం రెండువేల రూపాయల విరాళం మంజూరు చేసింది. శ్రీ రూప్‌సింగ్ ధ్యాన్‌చందు సోదరుడు. ప్రస్తుతం అస్వస్థతగా వున్నారు. ఆయన చికిత్సకోసం ప్రభుత్వం ఈ విరాళాన్ని మంజూరు చేసింది.

* * *

ఎండు మిర్చి ఎగుమతి కాలపరిమితిని ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకూ పొడగించింది.

స్థానికసంస్థల దుస్థితి

అమృతసర్ పౌరసన్మానంలో శ్రీ నంబూద్రిపాద్ వివరణ

అమృతసర్, ఏప్రిల్ 12

మనదేశంలో కేంద్ర ప్రభుత్వం మొదలుకొని గ్రామ పంచాయితీవరకు ప్రజా స్వామ్యాన్ని విస్తరింపచేయవలసిన అవసరం ఉందని కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ అమృతసర్ పౌరసన్మాన సభలో ప్రసంగిస్తూ అన్నారు.

కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్‌కీ, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడయిన శ్రీ యస్. ఏ. డాంగేకీ అమృతసర్ మునిసిపాలిటీ నేడు పౌరసన్మానం జరిపింది.

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిల్లో మాత్రమే ప్రజాస్వామిక వ్యవస్థ ఉన్నదని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

ఖచ్చితమైన పరిమితుల్లో పని చేయించవలసిన సంస్థలుగానే మునిసిపాలిటీలను రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణిస్తున్నాయని నంబూద్రిపాద్ అన్నారు.

మునిసిపాలిటీలు తమ కాళ్ళమీద తాము నిలవగలగాలి. వాటికి క్రమేణా ఎక్కువ అధికారాలివ్వాలని ఆయన అన్నారు.

విద్యా సంస్థలకూ, ఆసుపత్రులకూ డబ్బు తగినంతగాలేదు కాబట్టి, ప్రభుత్వం వాటిని తీసుకోవాలని కొన్ని స్థానిక సంస్థలు డిమాండు చేస్తున్నాయి. ఇది నిజంగా ఆశ్చర్యకరం. అత్యంత ప్రాముఖ్యమిచ్చి ఆలోచించవలసిన సమస్య ఇది అని ఆయన అన్నారు.

బల్వంతరాయ్ మెహతా కమిటీ ఇటీవల తయారుచేసిన నివేదిక ఈసమస్యను కొంత తేలిక చేసిందన్నారు. గ్రామ పంచాయితీలను ఇంకా విస్తృతంచేసి, మరింత బలపరచడానికి యిప్పుడు కృషి సాగుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఇంకా విస్తృతం చేయడంలో ఇదొక మంచి ముందంజ అన్నారు.

ఈ మార్పులను అమలు జరపడం కోసం తగు మార్గాలను సూచించడానికి కేరళలో కమిటీలను ఏర్పరచామన్నారు.

చేతి వృత్తుల కార్పొరేషన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

కేంద్ర ప్రభుత్వం భారత చేతి వృత్తుల అభివృద్ధి కార్పొరేషన్ (ప్రైవేట్) లిమిటెడ్ అనే పేర ఒక సంస్థను నెలకొల్పింది. దీని మూలధనం ఒక కోటి రూపాయలు.

విదేశాలనుంచి వచ్చే ఆర్డర్లను వెంటనే పంపడంకోసం ఈ కార్పొరేషనువారు చేవృత్తుల సరుకును తయారు చేయిస్తారు.

అఖిలభారత చేతివృత్తుల బోర్డు పనులకు కాని, రాష్ట్రాలు నెలకొల్పిన చేతివృత్తి సంఘాల పనులకు కాని ఎగుమతులు ఏర్పాటుచేయటం ఈ కార్పొరేషన్‌వారి ప్రధాన కార్యకలాపం. ఇప్పుడు అఖిలభారత చేవృత్తి సంఘంవారు కాని, రాష్ట్రసంఘాలవారు కాని ఎగుమతుల వ్యవహారాన్ని చూడ్డంలేదు.

దక్షిణ మొరాకోలో స్పానిష్ యుద్ధనావలా?

రాబట్ (మొరాకో), ఏప్రిల్ 12

స్పెయిన్ అధినివేశ రాజ్యమైన దక్షిణ మొరాకోలో ప్రధాన పట్టణం 'తార్ఫా' ఓడరేవుని నేడుస్పానిష్ యుద్ధనౌకలు కాపలా కాస్తున్నట్లు వార్తలు.

'తార్ఫా' పట్టణంలోకి స్పానిష్ సైన్యాలుకూడా వచ్చాయి. స్పానిష్ అధినివేశ ప్రాంతాన్ని మొరాకోకి అప్పగించుతున్నప్పుడు చివరిక్షణంలో గందరగోళం రేగడంవల్ల ఈ సైన్యాలు వచ్చినట్లు వార్తలు.

అధికార ఉత్సవ సందర్భంలో మొరాకో రాజు సందర్శనని స్పానిష్ అధికార్లు ఆటంకపరిచినట్లు ఇస్తిక్లాల్ పార్టీ పత్రిక అల్‌ఆలమ్ విలేఖరి 'తార్ఫా'నుంచి పంపిన వార్తలోవుంది.

అలాగే 'తార్ఫా'కి వస్తున్న రాయల్ సైనిక దళాన్నికూడా స్పానిష్ అధికార్లు ఆటంకపర్చినట్లు తెలుస్తోంది.

విమానాశ్రయంవద్దకు మొరాకో రాజుతో సైనికులు వెంటరారాదని, అతనికి విమానాశ్రయంవద్ద ప్రజలెటువంటి ఆహ్వాన మివ్వరాదనీ స్పానిష్ అధికార్లుకోరినట్లు అల్‌ఆలమ్ పత్రికా విలేఖరి తెల్పారు.

* * *

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీవారు ప్రభుత్వ పరిశ్రమల నిర్వహణ విషయాన్ని పరిశీలించేవరకూ వాటి నిర్వహణకై అనధికారులను నియమించే పనిని ప్రభుత్వం వాయిదా వేసింది.

కమ్యూనిస్టుపార్టీ మహాసభ

కొద్ది సవరణలతో రాజకీయ తీర్మానం ఆమోదం

రత్నసింగ్‌నగర్, ఏప్రిల్ 12

భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభలో రాజకీయ తీర్మానంపై పదిగంటలసేపు చర్చ జరిపి కొన్ని చిన్న చిన్న సవరణలతో దాన్ని ఆమోదించారు.

ప్రభుత్వ రంగాన్ని దెబ్బ తీయడానికి ప్రయత్నించే మితవాద అభ్యుదయ నిరోధకశక్తులు మన దేశానికి విదేశీ పెట్టుబడిని ముఖ్యంగా అమెరికా పెట్టుబడిని బాహాటంగా రానివ్వాలని వాదిస్తున్నారనీ, వారిఆటలను అరికట్టడంకోసం పార్టీపోరాటం నడపాలనీ ఆ తీర్మానంలోవున్న సంగతి పాఠకులకు విదితమే.

తీర్మానంలో కొన్ని ప్రధానమైన మార్పులను కొనిరావడానికి కొన్ని సవరణలు ప్రతిపాదించి వాటిపై వోటుకోరారు. కాని ఆ సవరణలన్నీ వీగిపోయాయి.

వ్యవసాయ సంస్కరణలను సమగ్రంగా సవరించడంకోసం పార్టీ ఆందోళన చేయాలనే ఒక సవరణను మహాసభవారు ఆమోదించారు.

మతతత్వ భూస్వామ్యతత్వపార్టీలు బలపర్చుతున్నాయి అని పేర్కొన్న భాగంలో మూలతీర్మానంలో జనసంఘం, ఒరిస్సాలోని గణతంత్ర పరిషత్తు, మద్రాసులోని ద్రవిడ మున్నేత్రకజగం పేర్లుమాత్రమే వున్నాయి. ఇప్పుడు వాటి సరసన పంజాబులోని అకాలీపార్టీనికూడా చేర్చే సవరణను మహాసభవారు ఆమోదించారు.

ప్రతినిధుల వర్గీకరణ

మహాసభ అర్హతా నిర్ణయసంఘంవారు సభకు వచ్చిన ప్రతినిధుల వర్గస్వభావాన్ని, విద్యార్హతలనూ వివరిస్తూ ఒక ప్రకటన చేశారు.

ఆ ప్రకటన ప్రకారం మొత్తం 474 మంది ప్రతినిధులలోనూ కార్మిక వర్గానికి చెందినవారు 45 మంది మధ్యతరగతివారు 276 మంది, రైతులు 101 మంది, వ్యవసాయ కూలీలు 13 మంది, భూస్వాములు 31 మంది, చిన్న వర్తకులు 8 మంది, వున్నారు.

మెట్రిక్ లోపు చదివినవారు 138 మంది, మెట్రిక్ చదివినవారు 181 మంది, పట్టభద్రులు 106 మంది. వున్నారు.

* * *

భోపాల్‌వద్ద ఒక ఊళ్లో బందిపోట్లు దాడిచేసి నలుగురిని కాల్చి వేశారు. ఇంకో ఊళ్లో అయిదు ఇళ్లను కొల్లగొట్టారు.

పశ్చిమ జర్మనీలో జనవాక్య సేకరణకై సన్నాహాలు

—అణ్వాస్త్ర స్థావరాలకు వ్యతిరేకంగా

ఫ్రాంక్‌ఫర్టు, ఏప్రిల్ 12

పశ్చిమజర్మనీ సైన్యాల్ని అణ్వాయుధాలతో ముంచెత్తడానికి పశ్చిమ జర్మన్ ప్రజలు ఒప్పుదల చూపుతారోలేదో తెల్సుకునేందుకై ఫ్రాంక్‌ఫర్టునగరంలోజనవాక్య సేకరణకోసం సన్నాహాలు ప్రారంభమైనట్లు వార్తలు తెల్పుతున్నాయి.

పశ్చిమజర్మనీలోని పెద్దనగరాలలో ఫ్రాంక్‌ఫర్టు అయిదవది.

జనవాక్య సేకరణకు సంబంధించిన వివరాల్నిగూర్చి చర్చించేందుకు నగరపాలకసంస్థ సోమవారంనాడు సమావేశమౌతుంది.

అణ్వాయుధ స్థావరాలలాంటి వివాదగ్రస్త విషయాలపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించడానికి నిశ్చయించుకున్న పశ్చిమజర్మనీ నగరాల్లో ఫ్రాంక్‌ఫర్టు నగరం మొదటిది.

గత నెలలో పశ్చిమజర్మనీ ఫెడరల్ పార్లమెంటులో ప్రతిపక్షమైన సోషల్ డెమాక్రాట్లు ప్రతిపాదించిన జనవాక్య సేకరణ సమస్యని పార్లమెంటు త్రోసివేసింది. ఇందుకు కారణం రాజ్యాంగంలో ఈ విషయానికి అవకాశం లేదని పార్లమెంటు చెప్పింది. పశ్చిమ జర్మన్ సైన్యాలకి అణ్వాయుధాల్ని సమకూర్చాలన్న సిద్ధాంతాన్ని పార్లమెంటు దిగువసభ గత మాసంలో ఆమోదించింది.

నాగసాకీ, హిరోషిమాలలో అణుబాంబు ఫలితాల్నిగూర్చి అధ్యయనం చేసేందుకు జపాన్‌కి ఒక ప్రతినిధివర్గాన్ని పంపడానికికూడా ఫ్రాంక్‌ఫర్టు నగర పార్లమెంటు నిర్ణయించింది.

బ్రీమెన్ రాష్ట్ర పార్లమెంటులోని సోషల్ డెమాక్రాట్లుకూడా జనవాక్య సేకరణకు సంబంధించిన బిల్లును ప్రతిపాదించేడానికిసన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది.

అమరవీరుల త్యాగఫలితమే నేటి ప్రజాతంత్ర విజయాలు

తుమ్మలపాలెం ఉత్సవాలకు కేరళ నాయకుని సందేశం

రత్నసింగ్‌నగర్, (అమృతసర్)
ఏప్రిల్ 12

గుంటూరుజిల్లా తుమ్మలపాలెంలో రేపు 13 వ తేదీని జరిగే మృతవీరుల సంస్మరణోత్సవాల్లో పాల్గొనదలచిన కేరళ ప్రముఖులు పార్లమెంటు సభ్యులు అయిన శ్రీ పి. కె. వాసుదేవన్ నాయర్, విమానంలో ఖాళీ దొరకకపోవడం వల్ల సభకు రాలేకపోయారు.

తుమ్మలపాలెం ఉత్సవాలలో స్వయంగాపాల్గొనలేకపోతున్నందుకు విచారం తెలుపుతూ శ్రీ వాసుదేవన్, సందేశం పంపారు:

"మహాయోధుల సంస్మరణసందర్భంలో మీరు జరుపుతున్న ఈ వుత్సవాలలో పాల్గొనలేకపోతున్నందుకు విచారిస్తున్నాను.

"భారతదేశంలో ప్రజాతంత్ర శక్తులు విజయాలను సాధించగలగడానికి ఈ వీరుల త్యాగఫలితమే కారణం. ఈ విషయాన్ని జ్ఞాపకం చేసుకుందాము. ఈనాడు భారతదేశంలో కనీసం ఒక్కరాష్ట్రం (కేరళ) లోనైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడగలిగింది. ఈ మహావీరుల త్యాగాల ఫలితంగా చేకూరిన విజయాలే నేడీరూపం దాల్చాయి. ఏ ఆశయాల కోసం ఈ వీరులు తమ ప్రాణాల నర్పించారో వాటిని సాధించడానికే కేరళలో మేము శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నాం.

"ఆంధ్రలో ప్రజాతంత్ర శక్తులు త్వరగా తమ బలాన్ని పెంపొందించుకుంటున్నాయి. మీఆంధ్రరాష్ట్రంలో కూడా ప్రజాప్రభుత్వంఏర్పడగలదు. ఇందుకు మాకు సందేహంలేదు."

ఘనాలో స్వతంత్ర ఆఫ్రికా దేశాల మహాసభ

మంగళవారంనాడు ప్రారంభం

అక్రా (ఘనా), ఏప్రిల్ 12

మంగళవారం నాడు యిక్కడ జరుగబోయే స్వతంత్ర ఆఫ్రికాదేశాల మహాసభలో దేశ బహిష్కృతులైన అల్జీరియా ముస్లిం నాయకులు కూడా పాల్గొంటారని వార్తలు తెల్పుతున్నాయి.

ఈ మహాసభలో పాల్గొనే ఇథియోపియా, లిబియా, మొరాకో, సూడాన్, ట్యూనిషియా, ఐక్య అరబ్ రిపబ్లిక్, ఘనా దేశాల ప్రతినిధులు - రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సహకార, ప్రపంచ వ్యవహారాలపైన చర్చలు జరుపుతారు.

ఈ మహాసభచర్చలలో అల్జీరియా సమస్య ప్రధానసమస్యల్లో ఒకటిగా వుంటుందని ట్యూనీషియా ప్రతినిధివర్గ సభ్యుడు అహ్మద్ టిలీ అన్నారు.

అల్జీరియా జాతీయవిమోచన సమితి నాయకుడు జెన్ ఆహీయా, అల్జీరియా కార్మిక సమాఖ్య కార్యదర్శి ఎమ్. రషీద్‌గాయిదీలు కూడా ఈ మహాసభకు హాజరవుతారు.

ఘనా ప్రధాని డా॥ క్వామీ న్క్రూమా మహాసభను ప్రారంభిస్తారు.

కాంగ్రెసు అధ్యక్ష పదవి

శ్రీ పిడతల రంగారెడ్డిగారిని నిలబెట్టే సూచన

హైద్రాబాద్, ఏప్రిల్ 18

ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షపదవికి శ్రీ పిడతల రంగారెడ్డిగారి పేరును ప్రతిపాదించాలని శ్రీ సంజీవరెడ్డిగారు యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇంతవరకు శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డిగారిపేరు ఈ సందర్భంలో వినవచ్చింది. కాని ఆయనను శ్రీ బెజవాడగోపాలరెడ్డిగారి స్థానేమంత్రిగా నియమించాలని సంజీవరెడ్డి గారు యోచిస్తున్నట్లు కూడా తెలుస్తోంది.

కాంగ్రెసు అధ్యక్షపదవి విషయంలోను, కార్యవర్గం నియామకం విషయంలోను చెన్నారెడ్డిగారికీ, సంజీవరెడ్డిగారికీ జరిగిన సంప్రతింపులు విఫలమైనట్లు కూడా తెలియవస్తోంది. (వి. వి.)

ఫ్రెంచి మంత్రివర్గంలో సంక్షోభమా?

ట్యునీషియా సమస్యపై

పారిస్, ఏప్రిల్ 12

ట్యునీషియా సమస్యపై ఫ్రాన్స్ వివాదాన్ని పరిష్కరించడంలో ఆంగ్లో - అమెరికన్ వర్గాల ప్రయత్నాలవల్ల ఉత్పన్నమౌతున్న మంత్రివర్గ సంక్షోభాన్ని గూర్చి చర్చించేందుకు జాతీయ శాసనసభ సమావేశం కావాలని నేటి రాత్రి ఫ్రెంచి మంత్రివర్గం కోరింది.

అయిదుమాసాల్నాడు ఏర్పడ్డ ఫీలిక్స్ గెల్లార్డ్ మంగళవారం నాడు మిశ్రమమంత్రివర్గం అసాధారణ సమావేశానికి హాజరవమని సభ్యుల్ని కోరాడు. మామూలు పార్లమెంటు సమావేశానికంటే రెండు వారాలు ముందుగానే ఈ సమావేశం జరుగుతోంది.

ట్యునీషియా సమస్యపై ఫ్రెంచి మంత్రివర్గ నిర్ణయాన్ని నేషనల్ అసెంబ్లీ (పార్లమెంటు) ముందుంచుతారు. ఈ నిర్ణయం జరుగబోయేముందు మంత్రివర్గంలో తీవ్ర వాగ్వివాదాలు పొడసూపనున్నట్లు వార్తలు తెలుపుతున్నాయి.

ట్యునీషియా వివాదాన్ని పరిష్కరించేందుకు అమెరికా సుహృద్భావ వర్గాన్ని పంపుతుందన్న ఐసెన్‌హోవర్ సూచనను తిరస్కరించవల్సిందిగా ఆరుగురు కన్సర్వేటివ్ మంత్రులు ప్రధాని గెల్లార్డ్‌ను కోరారని, అయితే ఉత్తరాఫ్రికాపై వీరి అభిప్రాయాలన్నీ తీవ్రవాద అభిప్రాయాలుగా వుండటంవల్ల గెల్లార్డ్ తిరస్కరించాడని తెలుస్తోంది.

పార్లమెంటు సమావేశం జరగాలనడంవల్ల ఎమ్మటే రాజీనామా ఇచ్చే సమస్య తప్పిపోయింది. "ఈ రాత్రికి రాజీనామా లుండవు" అని సమావేశంనుంచి బయటకు వచ్చిన కన్సర్వేటివ్ మంత్రి చెప్పారు.

అల్జీరియా యుద్ధసమయంలో ఫ్రాన్స్, ట్యునీషియాల మధ్య జరిగిన సరిహద్దు సంఘటనల విషయమై ఉభయ పక్షాలవారిని సమాధానపర్చే విషయమై అమెరికా ఏర్పాటు చేసిన సుహృద్భావ ప్రతినిధివర్గం తొలగిపోని పక్షంలో రాజీనామా లివ్వడానికి కన్సర్వేటివ్స్ సిద్ధంగా వున్నారు.

* * *

యునైటెడ్ ట్రేడుయూనియన్ కాంగ్రెసు నాయకుడు శ్రీ టి. కె. దివాకరన్ కొన్ని పరిశ్రమల్లో కార్మికులకు జీతాలు పెంచాలని ఏప్రిల్ 17 నుంచి నిరాహార దీక్ష పూనుతున్నారు.

విళంబి నామ సంవత్సర
చాంద్రమాన చైత్ర బహుళ
ఏకాదశి రా 11-54
ధనిష్ఠ ప 11-28

విశాలాంధ్ర

సోమవారం 14-4-58
చైత్రం-24-1880

ఎన్. జి. ఓ. ల న్యాయమైన కోర్కెలు

నాన్‌గజెటెడ్ వుద్యోగుల వేతనాలను నిర్ణయించడంలో ప్రభుత్వం సహేతుకమయిన సూత్రాన్నిగాని, సముచితమైన విధానాన్నిగాని అనుసరించడం లేదు. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ఒక రకమైన జీతాల స్కేళ్లు, నిబంధనలు అమలు జరుగుతుంటే, రాష్ట్రప్రభుత్వోద్యోగులకు మరో రకమయిన స్కేళ్ళు, నిబంధనలు అమలు జరుగుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రింద పనిచేస్తున్న వుద్యోగులకే రెండు రకాల జీతాల స్కేళ్ళు అమలులో వున్నాయి. ఉదాహరణకు పూర్వ హైద్రాబాద్ ప్రభుత్వ యంత్రాంగంలోనుంచి తీసుకున్న వుద్యోగులకు ఒక రకమైన జీతాల స్కేళ్ళు అమల్లో వుండగా, పూర్వాంధ్ర రాష్ట్రం నుంచి తీసికొన్న వుద్యోగులకు అంతకంటే తక్కువ జీతాల స్కేళ్ళు వున్నాయి. ఉభయ ప్రాంతాలను కలిపి విశాలాంధ్రగా ఏర్పరచిన తర్వాత సంవత్సరన్నర కాలం గడచినప్పటికీ యింతవరకు జీతాల స్కేళ్ళను సమన్వయపరచే ప్రయత్నమే జరుగలేదు.

దీనికితోడు తిండి, బట్టలు వగైరా జీవితావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇళ్ళ అద్దె సంగతి వేరుగా చెప్పనక్కరలేదు. అలాంటప్పుడు నాన్ గజెటెడ్ వుద్యోగులు తమకిచ్చే స్వల్ప వేతనాలతోను కుటుంబాలను పోషించుకోలేక అవస్థపడుతున్నారంటే అతిశయోక్తేమీ లేదు.

ఈ కారణాల వల్లనే ఆంధ్రప్రదేశ్ నాన్‌గజెటెడ్ వుద్యోగులు తమ వేతనాల స్కేళ్ళను కేంద్ర ప్రభుత్వోద్యోగుల స్కేళ్ళతో సమన్వయపరచమనీ, కరువు భత్యాన్ని పెంచమనీ, ఆందోళన చేస్తున్నారు. వారి కోర్కెలు న్యాయమైనవిగా వున్నప్పటికీ వాటిని తీర్చడానికి ఆంధ్ర ప్రభుత్వం ఇంతవరకేమీ ప్రయత్నించి వుండలేదు. విసిగివేసారి ఈ నెల 16వ తేదీన అందరూ సెలవు పెట్టి, ఆఫీసులకు వెళ్ళడం మానివేసి, తమ అసమ్మతిని ప్రభుత్వానికి తెలియజేయాలని రాష్ట్ర నాన్ గజెటెడ్ వుద్యోగుల సంఘం తీర్మానించింది.

ఆంధ్రముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర సంఘ తీర్మానం ఒక బెదరింపు లాంటిదని వ్యాఖ్యానించారు. ఎంతోకాలంగా ఎన్. జి. ఓ. లు చేస్తున్న విన్నపాలను, ఆందోళనను ప్రభుత్వం ఖాతరు చేయనందున వేరు గత్యంతరంలేక రాష్ట్రసంఘం ఈ నిర్ణయానికి వచ్చిందని ఎల్లరికీ తెలిసిందే. ఒకవైపున ముఖ్యమంత్రిగారే ఎన్. జి. ఓ.ల జీతం స్కేళ్ళను, కరువు భత్యాన్ని కొత్తదృక్పథంనుంచి చూడాలని ఆర్థిక మంత్రికి ఆదేశించినట్లుగా చెప్పుకున్నారు. కాని రెండోవైపున కరువుభత్యం వగైరా పెంచితే రెండు మూడు కోట్ల రూపాయలు అదనపు ఖర్చవుతుందని చెబుతూ, "బెదరింపులు" ముగిసిన తర్వాతనే ఏమి చెయ్యాలో ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

వాస్తవానికి రాష్ట్ర ఎన్. జి. ఓ. సంఘ తీర్మానం బెదరింపు కానేకాదు. కుటుంబ పోషణ జరుగక అవస్థపడుతున్న వుద్యోగులు కేవలం తమ బాధను ప్రభుత్వ దృష్టికి తేడానికే 16వ తేదీన సెలవుపెట్టి పని మానివేస్తున్నారు.

ఎన్. జి. ఓల ఇబ్బందులను యిప్పటికైనా గమనించి వారి న్యాయమైన కోర్కెలను తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలి. తమ క్రింద పనిచేసే వుద్యోగులలో వ్యాపించిన అసంతృప్తిని తొలగించడానికి ప్రతిష్ఠ అడ్డు రాకూడదు. అవసరమైన చర్యలను తక్షణమే తీసుకోవాలి.

దేశాభివృద్ధికి వేలాది పారిశ్రామిక కేంద్రాలవసరం

ఓఖ్లా కేంద్రానికి ప్రారంభోత్సవంచేస్తూ ప్రధాని నెహ్రూ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

దేశంలో పారిశ్రామిక కేంద్రాల అభివృద్ధివల్ల పరిశ్రమలు చక్కగా పెంపొందడానికి అనువైన వాతావరణం నెలకొంటుందనీ, తద్వారా ఎక్కువమందికి ఉద్యోగాలు లభించి మురికిపేటలు తగ్గుతాయనీ ప్రధాని నెహ్రూ నేడిక్కడ ఓఖ్లా పారిశ్రామిక కేంద్రానికి ప్రారంభోత్సవం చేస్తూ చెప్పారు.

ద్వితీయ ప్రణాళికా కాలంలో చిన్న పరిశ్రమలను పెంపొందించడం కోసం దేశంలో నిర్మించసంకల్పించిన మొత్తం 150 పారిశ్రామిక కేంద్రాల్లోనూ ఈ ఓఖ్లా కేంద్రం పెద్దది.

భారతజాతి సిరిసంపదలతో తులతూగాలంటే మన పరిశ్రమలు అధికాధికంగా పెంపొందవలసిన అవసరం వుంది. మనం చిన్నా పెద్దా, కుటీర, గృహపరిశ్రమలు మున్నగు అన్నిరకాల పరిశ్రమలకూ ప్రోత్సహించవలసివుంటుంది. మనకు మానవబలగం అపారంగావుంది. వారికందరికీ ఉద్యోగం కల్పించాలంటే ఎన్నో పరిశ్రమలవసరం. అయితే కొత్త పరిశ్రమలను నెలకొల్పడంతోపాటు మనం మురికిపేటలనుకూడా సృష్టించి కొత్త సమస్యలను తేరాదు.

కొంతకు లెక్కకువచ్చేవి పెద్దపరిశ్రమలే కాని, ప్రస్తుత చిన్నపరిశ్రమలకూ కుటీర పరిశ్రమలకు ఎంతో అవకాశం వుంది. చిన్న పరిశ్రమలు మనకు లక్షలసంఖ్యలో కావాలి.

ఈ పారిశ్రామిక కేంద్రాలలో శుచీ శుభ్రమూ గల భవనాలను కట్టి ఫ్యాక్టరీలకు ఇస్తారు. కార్మికులకు గృహాలూ, పాఠశాలలూ మున్నగు సౌకర్యాలుంటాయి. అందుకని ఈ పారిశ్రామిక కేంద్రాల నిర్మాణం అసలు సమస్యలో సరియైన పరిష్కార మార్గంగా వుంది. మనదేశం అభివృద్ధి చెందాలంటే ఇలాంటి పారిశ్రామిక కేంద్రాలను ప్రభుత్వ సహాయంతో నైతేనేమి, ఇతరుల సహాయంతో నైతేనేమి వేలసంఖ్యలో నిర్మించవలసివుంటుంది.

పరిశ్రమల్లో భాగస్వాములమనే భావాన్ని కార్మికుల్లో కలిగించాలి. కార్మికుని శ్రేయస్సును సదా కనిపెట్టి చూడకపోతే అతడు జాతీయ సంపదను సృష్టించడానికి ఎక్కువ శ్రద్ధ వహించడు.

వ్యవసాయ రంగంలో నైతేనేమి, పారిశ్రామిక రంగంలో నైతేనేమి దేశం సాధ్యమైనంతవరకూ సహకార పద్ధతిని అనుసరించడం సముచితం.

ఈ పారిశ్రామిక యుగంలో భారతదేశం ఇతరదేశాల కన్నా వెనకబడి వుండకుండాలంటే మనం ఆధునిక యంత్రాలను, ఆధునిక సాంకేతిక జ్ఞానాన్ని వినియోగించవలసివుందన్న మాట నిజమే. కాని ఆ యంత్రాలు మన మానవ బలగాన్ని నిరుద్యోగం చేసేటంత ఎక్కువగా వుండరాదు. అమెరికా బ్రిటన్లకు ఎక్కువ అనుకూలంగా వున్న స్వతశ్చలిత యంత్రాలు మన దేశానికంతగా పనికిరావని నా నమ్మకం అని ప్రధాని నెహ్రూ అన్నారు.

అంతకుముందు వాణిజ్య పరిశ్రమల మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ప్రసంగిస్తూ యజమానుల కష్టనిష్టూరాలను ప్రభుత్వం కనిపెట్టి వుంటుందని హామీ యిచ్చారు.

ఈ కేంద్రంలో నెలకొన్న ఫ్యాక్టరీలలో రేడియో భాగాలు, సైకిల్ భాగాలు, సేఫ్టీ రేజర్లు, ఎలక్ట్రిక్ తీగెలు మున్నగునవి తయారుచేస్తారు.

భారత, కాశ్మీర్ ప్రభుత్వాల పై నీచారోపణలు

భద్రతాసమితికి పాక్ లేఖ

ఐ రా స కార్యాలయం, ఏప్రిల్ 11

భారతదేశం మద్దతుతో కాశ్మీర్ ప్రభుత్వం దారుణ హింసాచర్యలు కొనసాగిస్తున్నదనీ, ఈ విషయాన్ని భద్రతాసమితి దృష్టికి తేవలసిందిగా తన ప్రభుత్వం ఆజ్ఞాపించిందని ఐ రా స లో పాకిస్తాన్ శాశ్వత ప్రతినిధి నేడు హెన్రీ కాబట్ లాడ్జ్‌కి ఒక జాబు రాశారు. ఐరాసలోని అమెరికా శాశ్వత ప్రతినిధి అయిన లాడ్జ్ ఈనెల భద్రతా సమితికి అధ్యక్షత వహిస్తారు.

విచారణ లేకుండా నాలుగు సంవత్సరాల అయిదుమాసాలు షేక్ అబ్దుల్లాను డిటెన్షన్‌లో ఉంచడంతో తృప్తి చెందక, విడుదల చేసిన నాటినుండి అతని అనుచరులను భయభ్రాంతులను చేయడానికి కాశ్మీర్ ప్రభుత్వం అన్నిరకాల అక్రమచర్యలకు పూనుకుంటున్నదని పాక్ ప్రతినిధి తన లేఖలో ఆరోపించాడు. నీకు భారతదేశంలో కాశ్మీర్ విలీనీకరణను ఆమోదించకుండా ఉన్నందుకు కక్షతోనే కాశ్మీర్ ప్రభుత్వం ఇలా చేస్తున్నదట.

ఈ హింసాకాండను కొనసాగిస్తున్నదంతా కాశ్మీర్‌లోని హిందువులూ, శిక్కులేనని ఈయన పేర్కొన్నారు.

భారతదేశంలో కాశ్మీర్ విలీనీకరణకూడదనేవారిని ద్రోహులుగా పరిగణిస్తామని భారతదేశీయశాఖ మంత్రి పంత్ రక్షణశాఖమంత్రి కృష్ణమీనన్‌లు ప్రసంగాలు చేశారన్నాడు.

కాశ్మీర్‌లో అరెస్టయిన వారి సంఖ్య వేలకు పైబడిందనీ, పొలిటికల్ కాన్ఫరెన్సు, ప్లెబిసైట్ ఫ్రంటు ముఖ్యులనందరినీ అరెస్టు చేశారనీ ఈయన ఆరోపించాడు. వీరి జాబితా నొకదానిని పొందుపరిచాడు. అరెస్టయిన వారిలో ఒకరిద్దరు దెబ్బలకు చనిపోయారని కూడా అన్నాడు.

దీనిని సంతా ఇక సహించలేక కాశ్మీర్ ప్రజలు సత్యాగ్రహోద్యమానికి పూనుకున్నారనీ, చాలచోట్ల నిరాహార దీక్షలుకూడా సాగుతున్నాయనీ అతను తన లేఖలో రాశాడు.

ఈ పరిస్థితి అంతా కాశ్మీర్ విషయంలో ఐ రా స లో గడచేసిన తీర్మానాలకు విరుద్ధమని తెల్పాడు.

భద్రతా సంఘ సభ్యులందరికీ ఈ లేఖ ప్రతులను అందజేయాలనీ, కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఈ హింసాకాండ నరికట్టేందుకు తగిన చర్యలను తీసుకోవలసిందిగా భద్రతా సంఘాన్ని కోరే హక్కును పాకిస్తాన్ ఉంచుకుంటున్నదని తెలిపాడు.

గిరి పిటీషన్ త్రోసివేత

హైద్రాబాదు, ఏప్రిల్ 12

పార్వతీపురం నియోజకవర్గంనుంచి లోక్‌సభ సభ్యుడుగా శ్రీ డిప్పల సూరిదొర ఎన్నికను ఖాయపరుస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు యిచ్చినసంగతి పాఠకులకు విదితమే. దానిమీద సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకోడానికి అనుమతించవలసిందిగా శ్రీ వి. వి. గిరి (ప్రస్తుతం యు. పి. గవర్నరు) తరఫున ఆంధ్ర హైకోర్టులో దరఖాస్తు దాఖలుచేయబడింది. దీన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచీవారు త్రోసిపుచ్చారు.

విజయవాడ రేడియో నాటక సప్తాహం

విజయవాడ, ఏప్రిల్ 13

ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం నిర్వహించిన నాటక సప్తాహం శ్రీ పి. రామకృష్ణయ్యగారి 'తుఫాన్' నాటకంతో మార్చి 31వ తేదీన సమాప్తి చెందినది. దీన్ని ఆరుబయట రంగస్థలం మీదకూడా ప్రదర్శించారు. ఇందులో రాఘవరెడ్డి పాత్రధారియొక్క సంభాషణా చాతుర్యం ప్రజలను బాగా నవ్వించింది. రమ పాత్రధారి బాగా నటించింది. పోతేగోపాలం, కుప్పయ్య, భద్రయ్య పాత్రలుకూడా ఫరవాలేదు. గోపాలం పాత్రధారికి ప్రాంప్టింగ్ అవసరం ఎక్కువైంది.

టాగూరు వ్రాసిన "బలిదానం" నాటకాన్ని అరుణోదయవారునిర్వహించారు వీరి నాటకానికి ప్రాంప్టింగ్ చాలా ఎక్కువగా వుండి శ్రోతలకు విసుగు వచ్చింది.

శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు వ్రాసిన "ప్రతిజ్ఞాయౌగంధరాయణం" నాటకను సప్తాహంలో ఒక రోజు ప్రదర్శించారు. ఈ నాటకం బి.బి.సి. ఫక్కీలో వేషాలు లేకుండా ప్రదర్శించబడింది. పాత్రలు స్టేజిమీద తమ తమ పోర్షన్లనుచూసిచదవడంవల్ల ప్రాంప్టింగ్ బాధ లేకుండాపోయింది. కాని నాటకం చూద్దామని రేడియోస్టేషనుకు వెళ్లినవారుమాత్రం కష్టమూనుకుని వినవలసి వచ్చింది. సెట్టుదగ్గరవిన్న వాళ్లకు బాగానేవుంది. ఇందు శ్రీ రామచంద్ర కాశ్యప యౌగంధరాయణుడుగా పాల్గొన్నారు. ఇంకా శ్రీయుతులు మండలీక సత్యనారాయణ, ఉప్పలూరి లక్ష్మీపతి, విన్నకోట రామన్న, మాచునేని, ఎ. రంగాచారి పాల్గొన్నారు. ఈ నాటికనురాఘవ నాటక కళాయందిరంతరపున శ్రీ శివలెంక బసవయ్య శాస్త్రి సమర్పించారు.

శ్రీ ఆచార్య ఆత్రేయ వ్రాసిన 'కప్పలు' అనే నాటకాన్ని ఆంధ్ర ఆర్ట్సు థియేటర్సువారు ప్రదర్శించారు. ఇందులో శ్రీపతిగా శ్రీ కోడాలి ఆదిశేషయ్య తన నటనా సామర్థ్యాన్ని చక్కగా ప్రదర్శించారు. శ్రీమతి కాంచనలత, ఈ పాళాల మొదలగువారుకూడా ఇందు పాల్గొన్నారు.

మొదటి రోజున శ్రీ అవసరాల సూర్యారావుగారి 'పంజరాన్ని' స్టూడియో స్టేజీగా ప్రసారం చేశారు. ఇదికూడా స్టేజి నాటకంగా వేస్తే బాగుండేది. ఇందులో కూచిమంచి కుటుంబరావు, నాగరత్నమ్మ ప్రభృతులు పాల్గొన్నారు.

చిలకమర్తివారి "గయోపాఖ్యానం" నాటకాన్నికూడా ఈ సప్తాహ సందర్భంగా ప్రదర్శించి ప్రసారం చేశారు. ఇందులో కృష్ణ పాత్రధారి శ్రీ బందా కనకలింగేశ్వరరావుగారి గొంతు బాగుండలేదు. ఇందు అక్రూరుడుగా చిలకలపూడి వెంకటేశ్వరశర్మ, గయుడుగా సీతారామశాస్త్రి, అర్జునుడుగా బి. వి. రంగారావు, సుభద్రగా సూర్యరత్నకుమారి ప్రభృతులు పాల్గొన్నారు.

ఆరుబయట రంగస్థలాలలో నిర్వహించడంవల్ల వచ్చిన ఒడుదుడుకులకు తట్టుకుని మొత్తంమీద సప్తాహాన్ని జయప్రదంగా నిర్వహించగలిగిన నిలయాధికారి శ్రీ జి. పి. ఎస్. నాయర్ ప్రభృతులు అభినందనీయులు.

ఆర్. ఎం. ఎస్. ఉద్యోగులకు సెలవులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

కేంద్ర ప్రభుత్వం ఆర్. ఎం. ఎస్. ఉద్యోగులకుకూడా తపాలా సెలవులు ఇవ్వాలనే విషయాన్ని సూత్రప్రాయంగా అంగీకరించిందని అఖిల భారత ఆర్. ఎం. ఎస్. ఉద్యోగుల సంఘంప్రధానకార్యదర్శి శ్రీ ఆర్. పి. ఛటర్జీ నేడు వెల్లడించారు.

నేడిక్కడ సంఘ కేంద్ర కార్యవర్గ సమావేశం ప్రారంభమైంది. ఇది మూడు రోజులపాటు జరుగుతుంది.

కార్యవర్గ సభ్యులు కాక ప్రాంతీయ సంఘాలనుంచి 40 మంది కార్యదర్శులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నేటి సమావేశాన్ని శ్రీ ఛటర్జీ ప్రారంభిస్తూ కార్మికుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ విధానాన్ని విమర్శించారు. ఒకవైపున నిర్వహణలో కార్మికులు పాల్గొనాలని ప్రభుత్వం అంటోంది. మరోవైపున ఆర్. ఎం. ఎస్. పునర్నిర్మాణ సంఘంలో కార్మికుల ప్రాతినిధ్యాన్ని తిరస్కరిస్తోంది అని ఆయన అన్నారు.

జాతి విచక్షణ విధానం

నెహ్రూ ప్రసంగంపై "న్యూయార్క్ టైమ్సు" సంపాదకీయం

న్యూయార్క్, ఏప్రిల్ 12

అమెరికాలోని జాతి విచక్షణ విధానంపై ప్రధాని నెహ్రూ ఇటీవల పార్లమెంటులో చేసిన వ్యాఖ్యానాన్ని పురస్కరించుకొని "న్యూయార్క్ టైమ్సు" పత్రిక నేడొక సంపాదకీయం ప్రచురించింది. ఆ సంపాదకీయంలో ఇలా వుంది:

అమెరికా జాతి విచక్షణ విధానాన్ని గురించి ప్రధాని నెహ్రూ భారత పార్లమెంటులో చేసిన ప్రకటనకు ఇక్కడివారంతా హృదయపూర్వకంగా స్వాగతం ఇవ్వాలి.

ఆసియాలో బలీయమైన వాణి నెహ్రూది. మన దేశంలో మనం చేస్తున్న కృషిని సరిగా అర్థంచేసుకొన్నవారి తరఫునుంచి నెహ్రూ ఆ ప్రసంగంచేశారు. అమెరికా ప్రభుత్వం జాతివిచక్షణవిధాన సమస్యను పరిష్కరించదలచిందనీ దానికి ప్రజలు తోడ్పడుతున్నారనీ నెహ్రూ అన్నారు.

అమెరికాలో వున్న ఈ విచక్షణ సమస్యపై ఆసియాలో కమ్యూనిస్టు ప్రచారకులు చాలా తీవ్రప్రచారం చేస్తున్నారు. అందుకని నెహ్రూ ఇప్పుడు చేసిన ప్రకటనకు చాలా ప్రాముఖ్యం వుంది. స్వేచ్ఛా, వ్యక్తి స్వాతంత్ర్యాలకోసం అమెరికా ఎంతపాటుబడుతున్నప్పటికీ ఈచిన్న లోపంమూలంగా మనం చెప్పేదానికీ చేసేదానికీ సంబంధంలేదని మన శత్రువులు ప్రచారం చేస్తున్నారు.

కాని మనం కనీసం చిత్తశుద్ధితో ఈ విషయంలో ప్రయత్నం చేస్తున్నామని నెహ్రూ మన తరఫున వాదించడానికి దొరికారు. ఆయన మాటలకు చాలా విలువవుంది.

అదే సమయంలో తమదేశంలోనే వున్న విచక్షణా విధానాన్ని గురించికూడా నెహ్రూ ప్రస్తావించారు. ఈ విషయంలో భారతదేశశాస్త్రాలుకూడా పవిత్రంగాలేవన్నారుఆయనఇష్టంతో నైతేనేమి,అయిష్టంతోనైతేనేమి మన దేశానికీ, తనదేశానికీ ఆయన ఈ విషయంలో పోలిక తెచ్చారు.

సమస్యస్వరూపం ఇక్కడా అక్కడా కొద్దిగా భిన్నమైనదేకాని ఈ విచక్షణా విధానాన్ని తొలగించడంఎలాగాఅనేమాత్రంఉభయత్రా సమానమే. భారతదేశంలో గృహ సమస్య కులానికి సంబంధించినదట. ఇక్కడజాతికిసంబంధించినది.అక్కడా ఇక్కడా కూడా విచక్షణను నిషేధిస్తూ ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. విచక్షణావిధానం చట్టవిరుద్ధం అని భారతరాజ్యాంగం పేర్కొంది. మన రాజ్యాంగ సవరణలుకూడా అంతే అంటున్నాయి.

ఇక్కడా అక్కడాకూడా కేవలం చట్టాలు మాత్రమే చాలవనేది రుజువయింది. ఈ సమస్య పరిష్కారం ప్రజల హృదయాల్లోంచి ఉద్భవించాలి.

భారత అమెరికా దేశాలు ఒకే రకం జాతుల సమస్య ఎదుర్కొంది. ఈ విషయంలో మేం కొంత అభివృద్ధి సాధించినట్లు నెహ్రూ భావించడం ముదావహం'

కలకత్తాలో నిర్వాసితుల అరెస్టు

కలకత్తా, ఏప్రిల్ 12

కలకత్తాలో నిషేధాజ్ఞల నుల్లంఘించి సత్యాగ్రహం చేసిన 133 మంది నిర్వాసితులను నేడు ప్రభుత్వం అరెస్టు చేసింది. అరెస్టు అయిన వారిలో 13 మంది స్త్రీలు. వీరు తమను పశ్చిమ బెంగాల్‌లోనే పునరావాసం కల్పించాలని ఆందోళన చేస్తున్నారు.

పోలీసుల "గలాటా" కవాతు

హైద్రాబాద్, ఏప్రిల్ 12

అంబరపేటలోని పోలీసు బస్తీలో నేడు పోలీసులు "గలాటా" కవాతు చేశారు. గలాటాలు జరిగినప్పుడు పోలీసులు ఏవిధంగా ప్రవర్తించవలసిందీ తరిఫీదు పొందడంకోసం ఆంధ్ర పోలీసుశాఖవారు కవాతును ఏర్పాటు చేశారు. ఇలాంటి కవాతును జరుపుతున్న ప్రథమ రాష్ట్రం ఇదే. ఆంధ్ర పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్ శ్రీ ఎ. కె. కె. నంబియార్ ఈ గలాటా కవాతును ప్రారంభించారు.

* * *

అఖిలభారత జీవిత భీమాపాలసీ హోల్డర్ల సంఘం పేరుతో మద్రాసులో ఒక సంఘం రిజిస్టరు అయింది.

కాశ్మీర్ ప్రజా నిర్ణయాన్ని గ్రాహంనివేదిక మార్చజాలదు

జాతీయ మహాసభ కార్యదర్శి బక్షీ అబ్దుల్ రషీద్ ఉద్ఘాటన

అమృతసర్, ఏప్రిల్ 12

గ్రాహం నివేదికలు కాని ఐ రా స తీర్మానాలు కాని కాశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని మార్చజాలవని కాశ్మీర్ జాతీయ మహాసభ ప్రధాన కార్యదర్శి బక్షీ అబ్దుల్ రషీద్ నేడిక్కడ ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ ఉద్ఘాటించారు.

కాశ్మీర్ ప్రజలకు, జాతీయమహాసభకు సంబంధించినంతవరకు అసలు సమస్య అనేదేమీ లేనేలేదని ఆయన చెప్పారు. జాతీయ మహాసభవారు పునర్నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నులై వున్నారు అనికూడా ఆయన చెప్పారు.

సభకు బాబీబల్వందకార్ అధ్యక్షత వహించారు.

కాశ్మీరు శ్రేయస్సుకోసం పంజాబీలు ఐక్యతతో వుండాలని ఆయన ఉద్బోధించారు. పంజాబులో మత కల్లోలాలు చెలరేగితే అది కాశ్మీరు ప్రజాపరిషత్తు వారిలో కలతలు రేపగలదని చెప్పారు.

కాశ్మీరులో ప్రజలను తప్పుదారిని పట్టించడంకోసం పాకిస్తాన్ శాయశక్తులాపాటుపడుతున్నది. కాశ్మీర్‌లో అనేక కుట్రలు పన్నుతున్నది. సరిహద్దు ఆవల శిబిరాలు నెలకొల్పి కుట్రదారులకు తరిఫీదు నిస్తున్నది.

"షేక్ అబ్దుల్లా ఇప్పుడు మసీదుల్లో సభలుజరిపి ప్రజల్లో మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నాడు. ఈ విషయం ప్రభుత్వానికి తెలుసును.జాతీయమహాసభకు కొన్ని సిద్ధాంతాలున్నాయి. అబ్దుల్లా ఎంత వ్యతిరేకించినా మహాసభ ఆ సిద్ధాంతాలకు కట్టుబడి వుండి తీరుతుంది. అబ్దుల్లాకు ప్రజాబలం అనేదిలేదు. కాబట్టి ఆయన విద్రోహ చర్యలు ఫలించవు అని రషీద్ అన్నారు.

తిరుగుబాటుదార్లతో ఇండొనేషియా పదాతి దళం మిలాఖత్?

జకార్తా, ఏప్రిల్ 12

మేజర్ హుతా బారత్ నాయకత్వానవున్న ఇండొనేషియా ప్రభుత్వ పదాతిదళం(మధ్య సుమిత్రాలోని తాపానుల్‌లోని) తిరుగుబాటు దార్లతో కలిసిపోయినట్లు వార్తలు.

ఈ విషయాన్ని ఒక సైనికాధికారి వొట్టిదన్నాడు. అయితే ఒకవేళ మేజర్ హుతాబారత్ తన ఉత్తర్వుల్ని అమలుజరపలేక పోయి విశ్వాసఘాతకంగా ప్రవర్తించిన పక్షంలో తాపానుల్ పట్టణంపై దాడి వెడలవల్సిందిగా ఆజ్ఞలిచ్చినట్టు ఇండొనేషియా సైన్యాధిపతి మేజర్ జనరల్ అబ్దుల్ హారీస్ అన్నారు.

మరో రెండు సైనికదళాలు కూడా తిరుగుబాటు జరిపినట్లు, తిరుగుబాటుదార్లతో కలిసినట్లూ వార్తలు.

మేజర్ జోహాన్, మేజర్ ఇస్తుందర్‌ల నాయకత్వానవున్న సైన్యాలు తిరుగుబాటుదార్లకు కోటగావున్న బుకిత్ టింగ్ పర్వత ప్రాంతంలోని పంగ్టాంగ్, కీషంతియా ప్రదేశాలవద్ద దెబ్బతిన్నట్లు 'ఏయా' వార్తాసంస్థ భోగట్టా.

సైన్యంలో తిరుగుబాటు వచ్చినట్లు వెలువడ్డ వార్తల్నిబట్టి అది సంభవమే కావచ్చునని ఒక సైనికాధికారి తెలిపారు.

అయితే కేంద్ర ప్రభుత్వసేనలు తాపానుల్ పైపుగా త్రిముఖంగా దాడి జరుపుతున్నట్లుకూడా వార్తలు.

మశూచివల్ల 2 నెలల్లో 20 వేలమంది చావు

తూర్పుపాకిస్తాన్‌లో

ఢాకా, (తూ.పాకిస్తాన్) ఏప్రిల్ 12

తూర్పుపాకిస్తాన్‌లో గత రెండు నెల్లలోనూ 20 వేల మంది ప్రజలు మశూచివల్ల మరణించినట్లు పాలకవర్గపార్టీ అయిన అవామీలీగ్ పార్టీ పత్రిక "ఇత్తాఫక్" ప్రకటించింది.

ప్రజలు కొన్ని గ్రామాలను విడిచిపెట్టి వెళ్ళారనీ, నదుల్లో మానవ శవాలు తేలుతున్నాయని ఈ పత్రిక వ్రాసింది.

* * *

నారాలోని నిర్వాసితులు చేసిన ఊరేగింపుతో పోలీసులు తలపడ్డందువల్ల మొత్తం 15 మందికి గాయాలు తగిలాయి.

ఉద్వాసితులైన భీమా ఫీల్డువర్కర్లు

హైద్రాబాద్, ఏప్రిల్ 12

జీవితభీమా కార్పొరేషన్ ఏర్పడిన దగ్గరనుంచీ ఇంతవరకూ ఉద్వాసితులైన రెండువేలమంది ఫీల్డువర్కర్లను తిరిగి పనుల్లోకి తీసుకోవాలని భీమా ఫీల్డు వర్కర్ల జాతీయ సమాఖ్యవారు కార్పొరేషన్ అధికారులను కోరుతూ మొన్న తీర్మానించారు.

ఫీల్డు వర్కర్ల ఇబ్బందులను తొలగించుకోవడంకోసం ఒక కార్యాచరణ పథకాన్ని తయారు చేయవలసిందిగా కార్యవర్గాన్ని కోరారు. ఫీల్డు వర్కర్లకు రెండునెలల జీతాన్ని బోనసుగా ఇవ్వాలనీ అధికారులను కోరుతూ మరొక తీర్మానం చేశారు.

తెలంగాణా ప్రాంతీయ కాంగ్రెసు కార్యవర్గం

హైద్రాబాద్, ఏప్రిల్ 12

తెలంగాణా ప్రాంతీయకాంగ్రెస్ కార్యవర్గంవారు నేడు శ్రీ పి. వి. నరసింహారావుగారి అధ్యక్షతను సమావేశమయ్యారు.

శ్రీ నర్సింగప్రసాద్ జైస్వాల్‌ను తెలంగాణా ఇబ్బందుల విచారణ సంఘం సభ్యులుగా తీసుకున్నారు.

ఇబ్బందుల విచారణకు ఒక సంఘాన్ని, ప్రత్యేకసౌకర్యాల సాధనకు మరొక సంఘాన్ని స్థాపించడానికి కమిటీవారు నిర్ణయించారు.

1958-59 లో తెలంగాణా ప్రాంత అభివృద్ధికి ముఖ్యంగా మైనరు ఇరిగేషను ప్రాజెక్టుల అభివృద్ధికి నాలుగు కోట్లను అదనంగా కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణా పద్ధతిస్థానే ఆంధ్ర పద్ధతిని అవలంబించడం అనేది క్రమంగా జరగాలనీ దానివల్ల తెలంగాణా ప్రజలకు ఇబ్బందులేమీ కలుగరాదనీ కూడా వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఫోర్డు సంస్థవారి అభివృద్ధి పథకాలు

వివిధ దేశాలకు గ్రాంట్లు

న్యూయార్క్, ఏప్రిల్ 13

సమీప ప్రాచ్యంలోను, ఆసియాలోను, విద్యా, ఆర్థిక, సాంఘికాభివృద్ధి పథకాలకై 20 లక్షల డాలర్ల ధనాన్ని కేటాయించినట్లు నేడు ఫోర్డుసంస్థవారు ప్రకటించారు. ఆలాగే అంతర్జాతీయ వ్యవహారాల్ని అధ్యయనం చేసేందుకు, అమెరికా, తదితర దేశాల్లో విద్యార్థుల నిమిత్తం, సాంస్కృతిక ప్రతినిధివర్గాల నిమిత్తం మరో 25 లక్షల డాలర్ల గ్రాంట్సు యిచ్చినట్లు కూడ ఫోర్డుసంస్థవారు ప్రకటించారు.

ఫోర్డుసంస్థవారి దేశాంతరఅభివృద్ధి పథకంక్రింద,పైనవివరించిన 20 లక్షల డాలర్లు ఇండియా, పాకిస్తాన్, నేపాల్, బర్మా, ఇండొనేషియా, టర్కీ, ఇరాక్, లెబనాన్ దేశాల మధ్య విభజించబడింది.

ఈ గ్రాంట్ల నివ్వడంలో ఫోర్డు సంస్థవారు ముఖ్యంగా విద్యాకార్యకలాపాలపై ఎక్కువశ్రద్ధ చూపారు.

భారత దేశంలోని బొంబాయి విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయాలకి ఈ పథకంక్రింద గ్రాంట్లు లభించాయి.

దేవీకుళం ఉపఎన్నిక

కేరళ కాంగ్రెసు సమాలోచనలు

ఎర్నాకుళం, ఏప్రిల్ 12

కేరళ కాంగ్రెసు కార్యవర్గమూ కేరళ కాంగ్రెసు శాసనసభాపార్టీ నేడు సమావేశమై దేవీకుళం నియోజకవర్గం ఉపఎన్నికలో కాంగ్రెసు జయాపజయాల విషయమై సమాలోచనలు జరిపారు.

దేవీకుళం నియోజకవర్గంలో కాంగ్రెసు ఎన్నికల కార్యాలయాలను నెలకొల్పారు. కేరళ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ దామోదరమీనన్ రేపటి నుంచీ దేవీకుళం నియోజకవర్గంలో పర్యటన మొదలు పెడతారు.

కర్రపెండలంబియ్యం

తిరువనంతపురం, ఏప్రిల్ 12

కేరళ కేంద్ర ఆహార పరిశోధనాశాఖవారు తొమ్మిది నెలలుగా కర్రపెండలం బియ్యాన్ని ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంవల్ల సత్ఫలితాలు కలిగాయని ఆహార పరిశోధనశాఖ ప్రచారక బృంద నాయకుడు శ్రీ పి. [illegible] నేడొక బహిరంగసభలో చెప్పారు.

ఈ సభకు కేరళ ఆహారమంత్రి శ్రీ కె. సి. జార్జి అధ్యక్షత వహించారు.

కేరళలో కేంద్ర ప్రభుత్వం కర్రపెండలం బియ్యం ఫ్యాక్టరీని నెలకొల్పడానికి సిద్ధంగావుందనీ ఆయన వెల్లడించారు. ఇంతవరకూ ఆహార పరిశోధనశాఖవారు చేసిన ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించదలచినట్లు కూడా ఆయన చెప్పారు.

కేరళలో భారత సేవకసమాజంగోష్ఠి

కొట్టాయం, ఏప్రిల్ 12

కేరళ భారతసేవక్ సమాజంవారు నేటి సాయంత్రం ఇక్కడ ఏర్పాటు చేసిన గోష్ఠిని గవర్నరు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు ప్రారంభించారు. ఈగోష్ఠి మూడురోజులపాటు సాగుతుంది. ఈ సమావేశంలో శ్రీ రామకృష్ణారావుగారు ప్రసంగిస్తూ ఆర్థిక సాంఘికాభివృద్ధి ఎక్కడ జరిగినా అందులో మానవకృషికి అత్యంత ప్రాధాన్యం వుందని చెప్పారు.

"మాతృభూమి" వల్లథోల్ సంచిక

ప్రధాని నెహ్రూ సందేశం

ఎర్నాకుళం, ఏప్రిల్ 13

కేరళ మహాకవి వల్లథోల్ స్మారకార్థం ప్రముఖ మలయాళ వార పత్రిక "మాతృభూమి" ప్రత్యేకసంచికను ప్రచురిస్తోంది. దానికి ప్రధాని నెహ్రూ సందేశంపంపిస్తూ వల్లథోల్ మలయాళంలో మహాకవే కాకుండా దేశమంతటా కీర్తిగాంచిన కవి అనీ, కొంతవరకు అంతర్జాతీయ ఖ్యాతినికూడా ఆర్జించిన మహాకవి అనీ పేర్కొన్నారు.

ఆయన నిర్మించి పోషించిన కేరళ కళామండలాన్ని అన్నివిధాలా ప్రోత్సహించవలసిన అవసరం వుందని శ్రీ నెహ్రూ అన్నారు.

శ్రీ రాజగోపాలచారిగారుకూడా ఒక సందేశం పంపించారు.

కేరళ సంగీత నాటక అకాడమీ

తిరువనంతపురం, ఏప్రిల్ 12

కేరళ ప్రభుత్వం శ్రీమతియుంకుళం పురత్తి అధ్యక్షతన సంగీత నాటక అకాడమీని నిర్మించారు.

అకాడమీ జనరల్ కౌన్సిల్‌లో 43 మంది సభ్యులున్నారు. ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి అకాడమీకి కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

విద్యామంత్రి, విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ డైరెక్టరు అకాడమీలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా వుంటారు.

బడుగు దేశాల ఆర్థికాభివృద్ధికి జనాంతిక సమావేశం

న్యూయార్క్, ఏప్రిల్ 12

బడుగుదేశాలకు సహాయం చేసేందుకు ప్రత్యేకనిధిని నెలకొల్పడానికి తగు పథకాన్నిగూర్చి గత అయిదు వారాలుగా సమావేశమవుతున్న జనాంతిక సమావేశం వచ్చేవారం పూర్తవుతుందని నేడిక్కడ అభిజ్ఞవర్గాలవారంటున్నారు.

బడుగు దేశాల ఆర్థికాభివృద్ధికై సాంకేతిక సహాయాన్నందించే విషయంలో బాధ్యత వహించేందుకు ప్రత్యేక సమితి నొకదాన్ని నెలకొల్పడానికి సమావేశంవారు అంగీకరించినట్లు ఈ వర్గాలవారంటున్నారు.

గుంటూరు జిల్లా పంచాయితీ సభ

గుంటూరు, ఏప్రిల్ 13

గుంటూరుజిల్లా ద్వితీయ పంచాయితీ మహాసభ గుంటూరులో ఈ నెల 20, 21 తేదీలలో జరుగుతుంది. సభలో ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు, ఆర్థికమంత్రి బ్రహ్మానందరెడ్డిగారు, ప్రణాళికా మంత్రి బసవరాజుగారు పాల్గొంటారు.

కమ్యూనిస్టుపార్టీ నిధి వసూళ్ల సంరంభం

తూర్పు గోదావరి జిల్లాలో రు 16 వేలకు పైగా వసూలు

రాజమండ్రి, ఏప్రిల్ 10

కమ్యూనిస్టు పార్టీ నిధి క్రింద తూర్పు గోదావరి జిల్లాలో రు 16,326-8-0 లు వసూలైనాయి. మరో రు 9458 లు వాగ్దానాలు వచ్చాయి.

తాలూకాలవారీగా వసూళ్లు, వాగ్దానాల వివరాలు ఇవి: రాజోలు తాలూకా రు 900 వసూలు (రు 1300 వాగ్దానం); అమలాపురం తాలూకా రు 1600 (రు 600); కొత్తపేట తాలూకా రు 1400 (రు1000); రామచంద్రపురం తాలూకా రు 8426-8-0 (రు 1400); తుని తాలూకా రు 400 (రు 600); పెద్దాపురం తాలూకా రు 100 (రు 458); పెద్దాపురంపట్టణం (రు 100); జిల్లా కమిటీ వసూళ్ళు రు 1000; రాజమండ్రి పట్టణం రు 2500 లు (రు 4000).

రాష్ట్ర మహాసభ అనంతపురం జిల్లాలో రు. 25000/- లు నిధి వసూలు చేయ్యాలని జిల్లాకమిటీ పిలుపునిచ్చింది. ఈ వసూళ్లు చేసిన తాలూకా లన్నిటిలోను ఇంటింటికి తిరిగి వసూలు చేసినవి ఒకటి రెండు గ్రామాలు తప్ప మిగతావి గ్రామానికి కొద్దిమంది వ్యక్తులవద్ద వసూలుచేసినవే. మొదట జిల్లాలో పార్టీ నిర్మాణ బలహీనత దృష్టిలో వుంచుకొని రు 25 వేల రూపాయలకంటె హెచ్చు వసూలు చేయలేమని నిర్ణయించుకొన్నారు. ఇందులో బడ్జెటు వేసేటప్పుడు జిల్లా కేంద్రానికి ఖర్చు అయ్యేడబ్బు, ప్రస్తుతం శాసనసభ్యుల నుండి తీసుకోబడుతుంది. దీన్ని కూడా కలిపి రు 25 వేల సేకరణకు అంచనా వేసినా, మరి రెండు వేలు తక్కువేవచ్చింది. అయినా రు 25వేల సేకరణకు పిలుపు ఇవ్వాలని జిల్లా కమిటీ నిర్ణయం తీసుకొంది.

ఈ నిర్ణయాన్ని తాలూకా కమిటీలు చర్చించాయి. అమలాపురం తాలూకా కమిటీ తప్ప మిగతా తాలూకాలు జిల్లా కమిటీ నిర్ణయించిన కోటాలు వసూలు చేయలేమని తక్కువ మాత్రమే వసూలు అవుతుందని తెలియచేశాయి. కాని జిల్లా కమిటీ నిర్ణయించిన కోటాలుకూడా తక్కువ అంచనాలని అనుభవంలో తేలిపోయింది.

పైగా ఏ తాలూకాలోను ఇంటింటికి వెళ్ళి వసూళ్లు చేసిన గ్రామాలు పట్టుమని పది లేవు. తాలూకాకు 10 గ్రామాలలోనే వ్యక్తులను కలుసుకుంటే తాము తీసుకున్న కోటాలు పూర్తి అయినాయి. పార్టీకి విస్తృత పలుకుబడివున్న గ్రామాలు తాలూకాకు 10 లేక 15 ను చొప్పున ఎన్నుకుని దళాలు ఇంటింటికితిరిగితే, కనీసం రు 85 వేల రూపాయలు వసూలు చేయగలమని తేలింది. అంతేగాక, జిల్లాలో సగభాగం పార్టీ బలహీనంగా వున్న భాగాలు ముట్టుకోనేలేదు. బలంగా వున్న సామర్లకోటలో మునిసిపల్ ఎన్నికలు రాబోతున్నవిగాన ఆ సందర్భంలో వసూలు చేయటానికి సామర్లకోట పట్టణ కమిటీ నిర్ణయించుకుంది.

నిస్త్రాణలో వున్న పార్టీ యంత్రం ఈ నిధి వసూళ్ళలో పెద్ద ఎత్తున కదలలేకపోయినా, పాక్షికంగానైనా పని చేసింది. పార్టీ నాయకత్వంలో ఒక భాగం మే కదలి పనిచేసింది. రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ తరిమెల నాగిరెడ్డిగారి పర్యటన కార్యక్రమం వారం రోజులున్న దనగా మాత్రమే నిధి వసూళ్ళకు సన్నాహాలు ప్రారంభించారు.

రాష్ట్రంలో అన్ని మూలలనుంచి వస్తున్న అనుభవమే ఈ జిల్లాలో కూడ కనపడింది. ప్రజలు ఏ రాజకీయపార్టీకి చెందినవారైనా, కార్యకర్తలు అడిగినదవుగానే ఎవరికి తోచిన మొత్తాలు వారు ఇస్తూ వచ్చారు. తాత్కాలికంగా డబ్బు దగ్గిర లేనటువంటివారు తాము ఇవ్వదలచింది వాగ్దానంచేశారు. తర్వాత కలుసుకోమని చెప్పారు.

శ్రీ నాగిరెడ్డిగారి పర్యటన సందర్భంలో ఆయనను చూడటానికి, ఆయన సందేశాన్ని వినటానికి గ్రామ గ్రామంనుండి పెద్ద సంఖ్యలో జనం హాజరైనారు. శ్రీ నాగిరెడ్డిగారు మాట్లాడిన సభలకు 50 వేలకు తక్కువ గాకుండా జనం హాజరైనారు. కొన్ని సభలకు రాత్రి 11 గంటలైనా కాచుకొని చూస్తున్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఈ నిధి వసూళ్ళలో పాల్గొన్న వారికి ఆత్మవిశ్వాసం, ఉత్సాహం కల్గింది.

ఈ నిధివసూళ్ళ కార్యక్రమంలో కార్యకర్తలు బహుస్వల్పసంఖ్యలో మాత్రమే పాల్గొన్నారు. ఈ లోపాన్ని సరిదిద్దుకొని మొత్తం యంత్రమంతా కదలటానికి వసూళ్ళ కార్యక్రమాన్ని కొనసాగించటానికి తాలూకా కమిటీలు నిర్ణయం తీసుకోవాలని జిల్లాకమిటీ కార్యదర్శి శ్రీ ఇనగంటి నారాయణరావు గారు కోరుతున్నారు. డెల్టాప్రాంతాలలో దాళ్వాకోతల అనంతరం వసూళ్ళకు పూనుకోవచ్చునని కొన్ని ప్రాంతాలు అసలు వెళ్ళనేలేదు. అటువంటి ప్రాంతాలలో నిధి ప్రోగుచేయటానికి తాలూకాకమిటీలు పూనుకోవాలి. ఏప్రిల్, మే నెలలు కూడా నిధి వసూళ్ళను కొనసాగించాలి. ఇప్పటికి మిగిలివున్న వాగ్దానాల వసూళ్ళకు వెంటనే పూనుకోవాలి. వసూళ్ళకు ఇంతవరకు పూనుకోకుండావున్న ప్రాంతమంతా వెంటనే నిధివసూళ్ళకు పూనుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నిధి వసూళ్ళలో విరాళాలిచ్చిన దాతలకు, వసూలు చేసిన పార్టీ సభ్యులు, సానుభూతిపరులకు, పార్టీ కార్యకర్తలకు ప్రత్యేకాభివందనలు అందచేస్తున్నారు.

చౌదరిపాలెం గ్రామశాఖ కృషి

కావలి, ఏప్రిల్ 8

ఈ నెల 4,5 తేదీలలో నెల్లూరు జిల్లా కావలి తాలూకా చౌదరిపాలెం గ్రామ కమ్యూనిస్టు శాఖ నాయకత్వాన సుమారు 25 మంది రాత్రులందు పొగాకట్టె తీసికిచ్చిన మొత్తము రు 24-0-0 లు ఎలక్షన్ల నిధికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో వృద్ధుల నుండి, పిల్లలవరకు చాలఉత్సాహంగా పాల్గొన్నారు. పగలల్లా పనిచేసుకొని రాత్రులందు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసామి, పాలేరు అనే భేదాలేకుండా అంతా నడుము వంచి సుమారు 20 ఎకరములలోని పొగాకట్టె కష్టించితీసి ఆ వచ్చిన మొత్తమును పార్టీనిధికి సమర్పించారు

కమ్యూనిస్టుపార్టీకి పెండ్లి కానుకలు

ముప్పవరం, ఏప్రిల్ 10

కందుకూరుతాలూకా ఊలవపాడు వాస్తవ్యులు శ్రీ షేక్ ఖాలేషావల్లి తన వివాహసందర్భంలో కమ్యూనిస్టు పార్టీకి రు 25 లు విరాళమిచ్చారు.

నిడుబ్రోలు

నిడుబ్రోలు కాంతినగర్‌లో శ్రీ ముక్కామల బాలకోటి, సంతోషం (బోడపాడు) గార్లకు వివాహం జరిగింది. ఈ సందర్భంలో కమ్యూనిస్టుపార్టీకి రు 5 లు విరాళమిచ్చారు.

వ్యవసాయ కూలీల విరాళం

ముంగండ, ఏప్రిల్ 11

తూర్పు గోదావరిజిల్లా ముంగండ శివారు కుసుమవారిపేట వ్యవసాయ కూలీలు కమ్యూనిస్టుపార్టీకి రు 5 లు విరాళమిచ్చారు.

నంబూరు కమ్యూనిస్టుపార్టీ గ్రంథాలయానికి విరాళాలు

నంబూరు, ఏప్రిల్ 11

గుంటూరుజిల్లా నంబూరులో కమ్యూనిస్టుపార్టీ కార్యాలయం ఇటీవల స్థాపించబడింది. పార్టీ కార్యాలయానికి, గ్రంథాలయానికి వస్తురూపంలోను, పుస్తకాల రూపంలోనూ శ్రీ జొన్నల అంజిరెడ్డిగారు రు 116 లు ఇచ్చారు. మరో పదకొండుమంది వందరూపాయలు ఖరీదుచేసే పుస్తకాలు ఇచ్చారు.

* * *

కొట్టాయంలో కలెక్టరు కార్యాలయం ముందు పికెటింగు చేసిన 11 మంది కాంగ్రెసు వారిని పోలీసులు అరెస్టు చేశారు.

అనంతపురంమునిసిపల్ సిబ్బందికినివాసగృహాలు

అనంతపురం, ఏప్రిల్ 10

అనంతపురంలో మునిసిపల్ సిబ్బంది సౌకర్యార్థం నిర్మించిన 27 నివాస గృహాలకు రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు నేడు పుదయం ప్రారంభోత్సవం చేశారు. శాసనసభ్యుడు శ్రీ చిదంబరరెడ్డిగారు సభకు అధ్యక్షత వహించారు.

‘సంజీవనగర్’ అని ఈ కాలనీకి ముఖ్యమంత్రి పేరుపెట్టారు. ఈ 27 నివాసగృహాలకు రు 35,000 లు ఖర్చు అయినాయి. కేంద్రప్రభుత్వం తలపెట్టిన పథకం క్రింద ఇవి తయారైనాయి. శ్రీ జ్వాలనయ్యగారు రేడియోగది కట్టించి ఇచ్చారు. శ్రీ కందిమల్ల శివయ్యగారు రేడియో ఉచితంగా ఇచ్చారు.

మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఉపన్యసిస్తూ, ప్రభుత్వం తక్కువ తరగతి ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కల్పించ తలపెట్టిందన్నారు. పాకీపనివారికి కూడ తగు నివాస గృహాలు కట్టించవలసి వుందన్నారు. దాతలు విరాళం ఇస్తే, ప్రభుత్వం కొంతడబ్బు వేసుకొని ఈపని పూర్తి చేయవచ్చునన్నారు.

శాసనసభ్యుడు శ్రీ పప్పూరు రామాచార్లుగారు ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారి ఛాయాచిత్రాన్ని ఆవిష్కరించారు.

మునిసిపల్ చైర్మన్ శ్రీ మేడా సుబ్బయ్యగారి వందన సమర్పణతో సభ ముగిసింది.

మునిసిపల్ ఉద్యోగుల జీతాలు

విజయవాడ, ఏప్రిల్ 11

మునిసిపల్ ఉద్యోగుల వేతనాలు హెచ్చించాలనీ, అందుకు ఒక “పే-కమిషన్”నియమించాలనిరాష్ట్ర మునిసిపల్ ఉద్యోగుల సంఘ కార్యదర్శి శ్రీ పి. రామకృష్ణారెడ్డిగారు నేడొక ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వం మొదట పే-కమిషన్ నియమించినప్పుడు, మునిసిపల్ ఉద్యోగుల విషయం ఉపేక్షించారనీ అదే విధంగా ఇప్పుడు రెండవ ‘పే-కమిషన్’ నియమించినప్పుడుకూడా నిర్లక్ష్యం చేశారని వీరు నిరసన తెలిపారు. రాష్ట్రంలోని ఎన్.జి.వో.లందరు కోరుతున్న విధంగా ఈ నెల 16 వ తేదీలోగా ఆంధ్ర ప్రభుత్వం ‘పే-కమిషన్’ నియమించాలనీ,దానిని మునిసిపల్ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని కోరారు.

భేతాళ వేషంలో వెంగళనాథం మృతి

కంచికచర్ల, ఏప్రిల్ 11

నందిగామ తాలూకా గొట్టుముక్కల గ్రామంలో యీనెల పదో తేదీ సాయంకాలం 5 గంటలకు కళాకారుడు కొండపల్లి నివాసి (స్వగ్రామం దాములూరు) శ్రీ వెంగళనాథం భేతాళ వేషంలో పాము కాటువల్ల మృతి చెందారు. తన కూతురు వివాహం నిమిత్తం ఆర్థిక సహాయం అర్థించుటకు గొట్టుముక్కల గ్రామంలో విచిత్ర వేషాలు వేసే సందర్భంలో భేతాళ వేషంలో పెద్ద పామును చేతపట్టుకొని తిరుగుచుండగా పాము కాటువేసింది. వీరి వయస్సు 35 సంవత్సరములు. చిత్రవేషములలో వీరికి పెట్టినపేరు. ‘మాభూమి’ నాటకంలోనూ కంచికచర్ల ప్రజానాట్య మండలి ‘పెత్తందారు’ నాటకంలోనూ, కొండపల్లి ప్రజానాట్య మండలిలోనూ అనేక వేషాలువేసి ప్రజల మన్ననలను పొందారు. 1948 నుండి కమ్యూనిస్టుపార్టీకి చాలా సేవచేశారు. వీరిమరణానికి కంచికచర్లప్రజానాట్య మండలివారు, గ్రామకమ్యూనిస్టు పార్టీవారూ విచారం వెలిబుచ్చారు

కొండపర్వ ప్రాథమిక పాఠశాల భవనం

కొండపర్వ, ఏప్రిల్ 10

తిరువూరు తాలూకా కొండపర్వ గ్రామంలో నిర్మించబడిన ప్రాథమిక పాఠశాల భవనానికి వ్యవసాయ మంత్రి శ్రీ తిమ్మారెడ్డిగారు ప్రారంభోత్సవం చేశారు.

శ్రీయుతులు గొట్టిపూళ్ళ ఉమామహేశ్వర వెంకటరామారావు, గున్నం మల్లికార్జున వరప్రసాదరావు గార్లు ముప్పయిసెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. తిరువూరు సమాజ వికాస కేంద్రం వారి ఆర్థికసహాయం, గ్రామస్థుల సహకారంతో పాఠశాలా భవనం నిర్మింపబడినది.

కొప్పరపు స్మారక నాటకకళా పరిషత్తు ఉత్సవాలు సమాప్తి

గొల్లప్రోలు, ఏప్రిల్ 9

ఈ నెల 8 వ తేదీ నుండి యిక్కడ జరుగుతున్న శ్రీ కొప్పరపు సుబ్బారావు స్మారక నాటక కళాపరిషత్తు వారి కార్యక్రమాలు నేటితో జయప్రదంగా ముగిశాయి.

8 వ తేదీన శ్రీ శారదా ఆర్టిస్టు టుర్సువారు “ఈయిల్లు అమ్మబడును” అనే నాటిక ప్రదర్శించారు. అనంతరం ఉప్పాడ కొత్తపల్లి ఆంధ్రసేవా నాట్యమండలివారి “దోపిడి”నాటకం ప్రదర్శనం జరిగింది. ఆ తరువాత శ్రీ బులుసు ఉదయభాస్కరంగారి అధ్యక్షతను మహాసభ జరుపబడింది.

పోటీ నాటకాల నాటికల సమీక్షను శ్రీ యేడిద నాగేశ్వరరావుగారు చేశారు. న్యాయమూర్తులుగా శ్రీ కొడాలి ఆదిశేషయ్య, శ్రీ యేడిద నాగేశ్వరరావు, శ్రీ కొప్పరపు సరోజినీగార్లు ఏకగ్రీవముగా చేసిన నిర్ణయానుసారముగా నాటకములలో శ్రీ గణేశ్వర నాట్యమండలి పెద్దాపురంవారిచే ప్రదర్శింపబడిన “పల్లెపడుచు” నాటకమునకు ఉత్తమప్రదర్శనప్రథమబహుమానం, శ్రీ రాఘవ కళాసమితి పెద్దాపురం వారిచే ప్రదర్శింపబడిన “పునర్జన్మ” నాటకమునకు ద్వితీయ బహుమానము, పునర్జన్మ నాటక రచయిత శ్రీ బెల్లంకొండ రామదాసుగారికి ఉత్తమ నాటక రచయిత బహుమానము, శ్రీ గణేశ్వర నాట్యమండలి పెద్దాపురం వారి “పల్లెపడుచు” నాటకంలోని సూరయ్య పాత్రధారికి ఉత్తమనటుని బహుమానము, శ్రీరాఘవ కళాసమితి పెద్దాపురంవారి “పునర్జన్మ” నాటకంలో నిర్మలపాత్ర ధారిణికి ఉత్తమ నటి బహుమానము యిచ్చారు.

నాటికలలో శ్రీ సరస్వతీ నాట్య నికేతనంవారి “నాబాబు” నాటికకు ప్రథమ బహుమానము, జయరాం స్మారక కళాసమితి గూడూరువారిచే ప్రదర్శింపబడిన “చీకటి దొంగలు” నాటికకు ద్వితీయ బహుమానము; “యీ రోజు ఖాకట్టు” నాటిక రచయిత శ్రీ కారెపు అప్పలస్వామిగారికి ఉత్తమనాటిక రచయిత బహుమానము, శ్రీ జయరాం స్మారక కళాసమితి గూడూరువారి “చీకటి దొంగలు” నాటికలో డాక్టరు పాత్రధారి వేణుగారికి ఉత్తమ నటుని బహుమానము, శ్రీ సరస్వతీ నాట్యనికేతనము కాకినాడవారి “నా బాబు” నాటికలో రాధ పాత్రధారిణి బాలామణికి ఉత్తమ నటి బహుమానము యిచ్చారు. ఆంధ్ర నాటక కళాసమితి సామర్లకోటవారి “ఛలోఢిల్లీ” నాటికలో ఘోరీ సుల్తాన్ పాత్రధారికి ప్రత్యేక నటుని బహుమానము, “ఛలోఢిల్లీ” నాటికకు ఉత్తమ రంగాలంకరణ బహుమానము, కొప్పరపు సరోజినీగారు ప్రదానం చేశారు. ఇవిగాక శ్రీ ప్రజానాట్యమండలి తొండంగివారిచే ప్రదర్శింపబడిన “మూడో యుద్ధం” నాటికలో సిద్ధాంతి పాత్రధారికి, శ్రీ ప్రజానాట్యమండలి తునివారి “పరివర్తన” నాటకంలో దాసుపాత్రధారికి ఆంధ్ర ప్రజానాట్య కళాసమితి కొత్తపల్లివారి “పల్లెపడుచు” నాటకంలోని రమాదేవి పాత్రధారిణి శ్రీమతి పి. జి. సీతాదేవికి, “ఈయిల్లు అమ్మబడును” నాటికలో భర్త పాత్రధారికి, నవోదయ కళాసమితి పిఠాపురంవారి “విశ్వశాంతి” నాటకంలోని సైంటిస్టు పాత్రధారికి, శ్రీ గణేశ్వర నాట్యమండలి పెద్దాపురం వారి “పల్లెపడుచు” నాటకంలోని “గోపి” పాత్రధారికి, “పునర్జన్మ” నాటకంలోని డాక్టరు పాత్రధారికి, “పోతుగడ్డ” నాటకంలోని ముక్కంటి పాత్రధారికి, “దోపిడి” నాటకంలోనిపిచ్చివాడు పాత్రధారికి ప్రత్యేక బహుమతులివ్వబడ్డాయి.

7 వ తేదీన శ్రీ కొప్పరపు సరోజినిగారికి సన్మానం జరిగింది.

సినీనటి శ్రీమతి అంజలిదేవి రు. 116 లు ఉత్సవాలకు విరాళంగా పంపిస్తున్నట్లు తెలియజేశారు. ఇందుకు పరిషత్తుతరఫున వారికి హృదయపూర్వక అభివందన లర్పించారు. ప్రతిసంవత్సరము ఉత్తమ నటికి ఒక బహుమానము యిస్తానని వాగ్దానము చేసిన శ్రీ కొప్పరపు సరోజినీగారికి, ఉత్తమనటునకు ప్రతి సంవత్సరము ఒక బహుమానము యిస్తామని ఆంధ్రనాటక కళాసమితి (రిజిష్టర్డు) సామర్లకోట వారి తరఫున వాగ్దానంచేసిన శ్రీ సమయం వీర్రాజు గారికి కార్యదర్శి అభివందన లర్పించారు. పురజనులకోరికపై జయరాం స్మారకకళాసమితి గూడూరు వారు “చీకటి దొంగలు” నాటిక ప్రత్యేక ప్రదర్శన మిచ్చారు. కళోత్సవాలలో తోడ్పడిన వారెల్లరకు కార్యదర్శి వందనలు సమర్పించారు.

కూచిపూడి నటరాజ నాట్యకళా సమితి

కూచిపూడి, ఏప్రిల్ 10

కూచిపూడి కళాకారులు, అభిమానులు నిన్నటి రోజు సమావేశమై “నటరాజ నాట్యకళా సమితి”ని స్థాపించారు.

కూచిపూడిలో నాట్య కళాశాలా భవనాన్ని నిర్మించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

పెద్దాపురం తాలూకా కాంగ్రెసు సంఘ సమావేశం

పెద్దాపురం, ఏప్రిల్ 7

పెద్దాపురం తాలూకా కాంగ్రెసు సంఘ సభ్యులు, మండల కాంగ్రెసు సభ్యులు ఈనెల 6 వ తేదీన ప్రత్తిపాడు ట్రావెలర్సు బంగళాలో తాలూకా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ పంతం ప్రసాదరావుగారధ్యక్షతను సమావేశమై బులుసు సాంబమూర్తి, అబుల్ కలాం అజాద్, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగార్ల మృతికి సంతాపం వెలిబుచ్చారు.

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు యీ తాలూకా పర్యటనకు వచ్చేటప్పుడు యీ తాలూకా కాంగ్రెసు సంఘమువారికిగాని మండల కాంగ్రెసువారికిగాని తెలియపర్చనందున తీవ్ర అసమ్మతిని తెలియపరుస్తూ యిందుగురించి 15 రోజులలోగా తగు సమాధానము పంపించమని శ్రీ జిల్లా కాంగ్రెసు సంఘం వారిని కోరుతూ తీర్మానించారు. ఈ ప్రకారం వెంటనే సమాధానము రానియెడల యీ సంఘసభ్యులు రాజీనామా చేయుటకు తీర్మానించారు.

కృష్ణాజిల్లా విద్యార్థుల, యువకుల వేసవి శిబిరం

విజయవాడ, ఏప్రిల్ 11

కృష్ణాజిల్లా ప్రొద్దుటూరులో మే 1 తేదీనుండి 7 వ తేదీవరకు జరుపనున్న విద్యార్థుల యువజనులశిక్షణాశిబిరానికి సాధ్యమయినంత ఎక్కువ మందిని వచ్చేటట్లు చేయాలని ఇక్కడ జరిగిన కన్వీనింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ శిబిరం ఉపన్యాసకులుగా వివిధ రాజకీయాభిప్రాయాలు గలవారిని ఆహ్వానించుతున్నారు. రాజకీయ భేదాభిప్రాయాలతో నిమిత్తంలేకుండా విద్యార్థులు యువకులు శిక్షణాశిబిరానికి రావచ్చుననీ, పంచవర్ష ప్రణాళిక సాంఘిక సంక్షేమ పథకాలు జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు, సర్వోదయ ఉద్యమం తదితర అనేక విషయాలపై ఉపన్యాసాలు ఉంటాయని కన్వీనింగ్ కమిటీవారు ప్రకటిస్తున్నారు. శిక్షణానంతరం దళాలుగా బయలుదేరి వైజ్ఞానిక ప్రదర్శనలు, వయోజనవిద్యాప్రచారం మొదలగు కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు వీరు తెలియజేశారు. వారంరోజులు ఖర్చులకుగాను రు 7-0-0 రుసుము చెల్లించాలని వీరు తెలుపుతున్నారు.

రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా

గన్నవరం తాలూకా రైతుసంఘ అభ్యర్థన

గన్నవరం, ఏప్రిల్ 12

మే నెలాఖరులోగా వ్యవసాయ శాఖవారు రైతులకు ఎరువులుసరఫరా చేయాలని కోరుతూ 8 వ తేదీన గన్నవరంలో జరిగిన తాలూకా రైతుసంఘ కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. తాలూకా రైతు మహాసభను ముస్తాబాదలో మే నెలమొదటి వారంలో జరపాలనీ, రెండువందల ఎకరాలకు పైబడి సాగుకల పంట కాల్వలను పి. డబ్ల్యు. డి. శాఖ యాజమాన్యానికి మార్చాలనీ, ఉయ్యూరు పంచదార ఫ్యాక్టరీవారు చెరకు రైతులకు 1954 నుండి 57 వరకు యివ్వవలసిన బకాయీలను వెంటనే యివ్వాలనీ, మంటాడ - వేమూరు మధ్య రోడ్డును జిల్లాబోర్డువారు బాగు చేయించాలనీ, ఆరోడ్డును జిల్లాబోర్డు నుండి హైవేసు శాఖకు మార్చాలని కోరుతూ తీర్మానాలు చేశారు.

లేఖలు

‘పాడి-పంటలు’ పత్రిక

మహాశయా !

రైతులకు ఎరువులు విత్తనాలు వగైరా కావాలంటే వ్యవసాయ శాఖాధికారులకు ముందు “పాడి పంటలు” మాసపత్రికకు రెండు రూపాయల పావులా చెల్లిస్తేనే దొరుకుతాయి. ఎంతనిర్బంధంగా వసూలు చేస్తారో అంత మందకొడిగా సంచికలు అందజేస్తారు. క్రిందటి సంవత్సరం ఏప్రిలు, మేనెల సంచికలు యిప్పుడు అందుతున్నాయి. టపాలో పంపితే తేలికగా అయ్యే పద్ధతి తీసివేసి ఫీల్డుమెన్, లెవెలు వర్కర్లుద్వారాపంపుతారు. లేకపోతే ఆఫీసులోనే కట్టలుపడియుంటాయి. ఉచితంగా పంపేటప్పుడు సరిగ్గా నెలాఖరుకు అందేవి. రైతులకు అన్నివిధాలా అమూల్య సమాచారమును అందజేసే పత్రిక వ్యవసాయ తరుణమమించినతరువాత ఆలస్యంగా పంపడం దారుణం. గాన ప్రభుత్వము వారు శ్రద్ధబూని వారు క్రొత్తగా నడిపే పంచాయితీ పత్రికతో జోడించి సకాలములో పంపాలని కోరుతున్నాను.

మేచినేని వెంకటేశ్వరరావు,

ప్రయాణీకులకు అందుబాటులోలేని రైలుబండ్లు

మహాశయా,

బెజవాడ - మద్రాసులమధ్య నడుస్తున్న ప్యాసింజర్ బండ్లు యేనాడూ నిర్ణీతవేళకు నడిచిన పాపాన పోలేదు. ఈ ప్యాసింజర్ల నిమిత్తం ఆయాస్టేషన్లలో ప్రయాణీకులు గంటలతరబడి పడిగాపులు కాచి, చివరికి విసుగుచెందుతున్నారు.

దాదాపు పది సంవత్సరాలక్రితం వాల్తేరు - మద్రాసు ప్యాసింజర్ (నెం॥ 10) వాల్తేరులో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి, బెజవాడకు వచ్చి, అచ్చటనుండి ఉదయం 6గంటలకు బయలుదేరి మద్రాసుకు సాయంత్రం 6 గంటలకు చేరుతుండేది.అంటే వాల్తేరునుండి యిది 24 గంటలలో మద్రాసుకు చేరేది. అవి యుద్ధపు రోజులు. నేటికంటే జాదు రద్దీంపు బండ్లు పరుగెత్తుతున్నా ప్యాసింజరు బద్లు ఆలస్యంకావడంఅరుదు. ఇంతేకాకుండా బ్రిటీషు హయాంలోయే ఒక్క ప్యాసింజర్ బండి తరచుగాఆలస్యమయితే అధికారులు ఆ బండ్లలో స్వయంగా ప్రయాణించి అవసర చర్యలు తీసుకొనేవారు. మరీనాడు నెం. 80 ప్యాసింజర్ బెజవాడ నుండి మద్రాసుకు చేరడానికి 20 గంటలు తీసుకొంటూంది. ఇందుకు కారణ మేమిటి? అప్పటికీ యిప్పటికీ మద్రాసు - బెజవాడల మధ్య అదనంగా జనతా ఎక్స్‌ప్రెస్ ఒక్కటి మాత్రమే ప్రవేశపెట్టారు.

నేటికైనా ప్రయాణీకుల సౌకర్యానికనుగుణ్యంగా యీ ప్యాసింజర్ బండ్లను నడపాలన్న వుద్దేశం అధికారులకు వున్నట్లయితే పూర్వంవలెనెం. 10 ప్యాసింజర్‌లాగా సాయంకాలం 6 గంటలకు మద్రాసుకు చేరుకొనేటట్టు నెం. 80 బండిని నడపడంవల్ల యిటు ప్రజలకు, అటు రైల్వేకు యింతో లాభదాయకంగావుంటుంది.

వై. సుందరమూర్తి.

పసుపు ఎగుమతి

ఆంధ్రరాష్ట్రములో పసుపుపంట పండించడంలో కడపజిల్లా ప్రముఖ స్థానము వహించుతోంది. కడపనుండి బొంబాయి, కాన్పూరు, కలకత్తా వగైరాప్రాంతాలకు పసుపుఎగుమతి అవుతూంటుంది. ప్రస్తుతం రైతులు సరుకు బజారుకు తెచ్చి అమ్ముతున్నారు — గాని పైకి ఎగుమతి చేయుటకు రైల్వేబుకింగ్ బొత్తిగా లేకపోవటంతో వ్యాపారము చేయుటకు వెనుకాడుతున్నారు. మామూలు ధరకన్న పుట్టి రు 10 లు తక్కువధరకు వ్యాపారము జరుగుచున్నది. ఈ సంవత్సరము సకాలములో వర్షాలులేక, తెగుళ్ళు వచ్చి పంటు చాలా తగ్గిపోవటమేగాక పసుపుకు సరియగు ధరలు లేక అష్టకష్టాలు పడుతున్న రైతాంగానికి రైల్వే బుక్కింగ్ కూడా సరిగా ఇవ్వకపోవటం గోరుచుట్టుపై రోకటిపోటుగా వున్నది. ప్రస్తుతం కడప టవున్‌లో 30 వేల మూటలు ఎగుమతిలేక నిలచిపోయి వున్నాయి. కావున యీవిషయములో ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకొని ఎప్పటికప్పుడు సరుకు ఎగుమతి చేసుకొనేందుకు వీలుగా రైల్వేవాగన్లు ఇప్పించి, రైతులకు సరియగు ధరలు వచ్చేందుకు అవకాశం కల్గచేయాలని కోరుతున్నాను.

జి. పెద్దిరెడ్డి,

పాఠశాలలను ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలి

కడపజిల్లా ఉపాధ్యాయ సంఘ అభ్యర్థన

కడప, ఏప్రిల్ 7

కడపజిల్లా ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ సమావేశం సంఘ ఉపాధ్యక్షులు శ్రీ నారు సుబ్బన్నగారి అధ్యక్షతక్రింద 6వ తేదీన కడపలో జరిగింది. ప్రత్యేకాహ్వానంపై వివిధ తాలూకా సంఘ అధ్యక్ష కార్యదర్శులుకూడా సభకు హాజరయ్యారు. సభాప్రారంభంలో మౌలానాఅబుల్ కలాం ఆజాద్‌గారి మరణానికి సంతాపం తెల్పుతూ శ్రద్ధాంజలి ఘటించారు.

జిల్లాసంఘ ప్రధాన కార్యదర్శి ఉద్యమ నివేదికను ప్రవేశపెడుతూ జిల్లాసంఘం ప్రభుత్వంతోను, అధికారులతోను సాగించిన చర్చలను వివరించారు. కార్యదర్శి శ్రీ కె. నాగమునిగారు జమా ఖర్చులను ప్రవేశపెట్టారు. శ్రీ వి. విజయరామరాజుగారు తక్షణ కర్తవ్యాలపై ఉపన్యసించారు.

శ్రీ వి. విజయరామరాజుగారిని అధ్యక్షులుగాను, రాజంపేట తాలూకానుండి శ్రీ జి. వెంకటసుబ్బయ్యగారిని, బద్వేల్ తాలూకా నుండి శ్రీ యస్. నరసింహులుగారిని కార్యవర్గసభ్యులుగాను కోఆప్ట్ చేసుకున్నారు.

నూతన బడ్జెటులో ఉపాధ్యాయుల వేతనాలను పెంచుటకు 84 లక్షల రూపాయలను కేటాయించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందించారు.(2) ఆంధ్రప్రభుత్వం ఆంధ్ర ఎన్నికల కమిషన్‌ల వాదనలను త్రోసివేసి రహస్య పద్ధతిని ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగాలని నిర్ణయించిన కేంద్ర ఎన్నికల కమిషన్‌ను అభినందించారు. (3)పాఠశాలలను స్వాధీనంచేసుకోవాలనే చట్టం శాసనసభ ఆమోదించినప్పటికీ, అమలు పరచడంలో ప్రభుత్వ విధానం తాబేటి నడకగా యుందని, ఇందువల్ల మేనేజర్ల, టీచర్ల మధ్యగల సంబంధాలుచెడిని విద్యాభివృద్ధికి ఆటంకం కల్గుతున్నదనీ, కాన రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని అర్థించారు. (4) వచ్చే విద్యా సంవత్సరం నుండి ఎలిమెంటరీ, సెకండరీ పాఠ్య పుస్తకాలన్నింటిని ప్రభుత్వమే అచ్చు వేయించుటకు యిప్పటినుండియే నిర్మాణాత్మకమైన చర్యలు ప్రారంభించాలని కోరారు. (5) ఉపాధ్యాయ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న శ్రీ సింగరాజు రామకృష్ణయ్యగారివిజయానికితోడ్పడాలని జిల్లాలోని ఓటర్లను అర్థిస్తూ ఆర్థికంగా సహకరించాలని జిల్లాలోని ఉపాధ్యాయులందరినీ అభ్యర్థిస్తూ తీర్మానించారు. (6) ఎయిడెడ్ ఎలిమెంటరీస్కూళ్ళ గ్రాంటు చెక్కులు ప్రతి నెలా 15 వ తేదీలోగా వచ్చేందుకు వీలుగా అవసరమైన చర్యలన్నిటినీ వెంటనే తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పేకమిషన్‌ముందు రైల్వేనాయకుల సాక్ష్యం

శ్రీ గురుస్వామి ప్రభృతుల ఢిల్లీ పయనం

విజయవాడ, ఏప్రిల్ 8

పేకమిషన్‌ముందు రైల్వే కార్మికుల జీతాల విషయంపై సాక్ష్యం యివ్వవలసినదిగా అఖిలభారత రైల్వే మెన్సు ఫెడరేషన్ ప్రతినిధులను, దక్షిణ రైల్వేయుంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులను ఢిల్లీకి ఆహ్వానించారు.

దక్షిణరైల్వే ఎంప్లాయీస్‌యూనియన్ తరఫున అధ్యక్షులు శ్రీ యస్. గురుస్వామిగారు, ప్రధాన కార్యదర్శి శ్రీ శివరామశర్మగారు 15 వ తేదీన పేకమిషన్‌ముందు సాక్ష్యం యివ్వడానికి ఢిల్లీ వెళుతున్నారు.

స్మారకసభ

కొండపల్లి, ఏప్రిల్ 12

గ్రామ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శిగా వుంటూ యీ నెల రెండవ తేదీన మరణించిన వరికూటి కోటయ్యగారి స్మారకసభ కొండపల్లిలో గ్రామకమ్యూనిస్టుకమిటీఅధ్యక్షాన జరిగినది. సాయంత్రం 4 గంటలకు కోటయ్యగారి ఫొటోను ఊరేగించారు. ఊరేగింపులో చిత్రవేషాలు, కర్రసాములు కూడ పాల్గొన్నవి. ఊరేగింపు సమాధివద్దకు వెళ్ళిన తర్వాత అమరజీవి గుణగణాలను గురించి గ్రామ పార్టీ కార్యదర్శి పి. గణపతిరావుగారు ఉపన్యసించారు. తర్వాత పంచాయితీ బోర్డు అధ్యక్షులు డాక్టరు వి. మోహనరావుగారు ఎర్ర జండా ఎగురవేశారు.

రాజమండ్రిచైర్మన్ రాజీనామా

రాజమండ్రి, ఏప్రిల్ 10

రాజమండ్రి మునిసిపల్ చైర్మన్ శ్రీ పోతుల వీరభద్రరావుగారు తన పదవికి రాజీనామా ఇచ్చారు. నిన్న మునిసిపల్ వైస్‌చైర్మన్ మాలి నాగేశ్వరావు అధ్యక్షతను జరిగిన కౌన్సిల్ సమావేశంలో శ్రీ వీరభద్రరావుగారి రాజీనామాను అంగీకరించారు.

ఈ సందర్భంలో వనం నాగేశ్వరావు (కాంగ్రెసు)గారు మాట్లాడుతూ వీరభద్రరావుగారు తన పదవీకాలంలో నిష్పక్షపాతంగా పరిపాలన సాగించారని అభినందించారు.

ప్రతిపక్షం తరపున శ్రీ జి. ఎస్. బాలాజీదాస్‌గారు మాట్లాడుతూ వీరభద్రరావుగారు స్వతంత్రుడుగా చైర్మన్‌గా వున్నప్పుడు నిష్పక్షపాతంగా వ్యవహరించ గలిగారని, కాని పార్టీ రాజకీయ దృక్పథాలు, కొందరు కౌన్సిలర్లు చేసిన పద్ధతులవంటి కొన్ని విషయాలలో విఫలమైనారని ఏ చైర్మన్ అయినా పట్టణ పురోభివృద్ధి ఆశయంగా పని చేసినప్పుడే ప్రజల మన్ననలనుపొంద గలడని తెలియజేస్తూ చైర్మన్‌పదవి నుండి విరమిస్తున్న శ్రీ వీరభద్రరావుగారిని అభినందించారు. ఇప్పటికైనా పార్టీ రాజకీయాలను విస్మరించి పట్టణ పురోభివృద్ధికి అందరుకలసి సమావేశమై ఏకగ్రీవంగా ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకునేందుకు కాంగ్రెసు కౌన్సిలర్లు తయారుగా వున్నారా? అని సూటిగా ప్రశ్నించారు.

రాజమండ్రిలో గవర్నర్‌కార్యకలాపాలు

రాజమండ్రి, ఏప్రిల్ 11

నేటి సాయంకాలం మునిసిపల్ మ్యూజియం హాలులో గవర్నర్ శ్రీ సచార్‌కు శ్రీ మాలి నాగేశ్వరరావుగారు పురపాలకసంఘ సభ్యులందరిని పరిచయం చేశారు. తర్వాత డ్రైనేజి స్కీము, నీటి సరఫరా పథకం, మెయిన్ బజార్ వెడల్పు చేయడం, సెంట్రల్ వెజిటబుల్ మార్కెట్టు, స్టేడియం మొదలైన పథకాలను అమలు జరిపించుటకు తోడ్పడవలసినదిగా కోరుతూ గవర్నరుకు ఒక మెమొరాండం సమర్పించారు.

ఈ సమస్య లన్నింటిని గురించి రిపోర్టులు తెప్పించుకొని పరిశీలించగలనని, అయితే స్వయంగా ప్రజాప్రతినిధులను కలుసుకొని అందరి కర్తవ్యాలను సమాలోచించుటకు వచ్చానని గవర్నరు అన్నారు. దేశంతోపాటు పట్టణాలు పెరుగుతున్నాయి. 80,000 గల పట్టణ జనాభా 1,50,000 పెరుగుటతో నీటి సరఫరా సరిపోవుటలేదనే విషయం స్పష్టం. పారిశుధ్యం విషయంలోకూడా జనాభా పెరుగుదలతోపాటు బాధ్యతలు పెరుగుతాయి. గోదావరి నది ఒడ్డున మురికివాసన నేటికీ పోలేదు. బాధ్యతలను నిర్వహించుటకు తగినకృషి చేయాలి. ప్రజలలో పౌరబాధ్యతలను హెచ్చుగా కల్గించాలి. కౌన్సిలర్లు ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి ప్రజలలో తాము నిర్వహించవలసిన బాధ్యతలను నెరవేర్చేటట్లు చేయాలి. తమకు తాము సహకార పడేటట్లు చూడాలి. పట్టణాలలో హోటళ్ళు, లాడ్జీలలోను, వేశ్యాగృహాలలో జరుగుతున్న భోగవిలాసాలు, అవినీతిని నిర్మూలించుటకు పూనుకోవాలని గవర్నరు కోరారు.

సభలుసమావేశాలు

రాష్ట్ర నాయీ బ్రహ్మణ సంఘ కార్యవర్గ సభ్యుల సమావేశం మే నెల 22 వ తేదీ ఉదయం 8 గంటలకు గుంటూరు హిందూ కళాశాలలో జరుగుతుంది.

సహకార ఉద్యమంపై ప్రభుత్వ ఆధిపత్యం, పలుకుబడి కూడదు

భారతీయ సహకార మహాసభలో ప్రసంగిస్తూ శ్రీ కె. డి. మాళవీయ ఉద్ఘాటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

శ్రీ కె. డి. మాళవీయ నేడు ఇక్కడ భారతీయ సహకార సంఘ మూడవ మహాసభలో అధ్యక్షోపన్యాసమిస్తూ, భారతీయ సహకార ఉద్యమంపై రోజురోజుకు ప్రభుత్వాధికారుల పలుకుబడి, ఆధిపత్యం పెరుగుతున్నందుకు తన ఆందోళనను వెలిబుచ్చారు.

సహకార ఉద్యమం అధికారుల కంట్రోలుకు అతీతంగా వుండవలసిన ఆవశ్యకతను గురించి ఆయన నొక్కి చెప్పారు. సహకార ఉద్యమం మరొకరి ఆధిపత్యాన వుంటే అది సహకార ఉద్యమం అనిపించుకోదని ఆయన అన్నారు. ప్రభుత్వముపై అది ఆధారపడితే అది కొన్ని వ్యవహారాలను తాను నిర్వహించగల్గే స్థితిలో వుండదని, దాని ప్రధాన స్వభావమైన సహకార లక్ష్యాలనే అది కోల్పోతుందని శ్రీ మాళవీయ అన్నారు. "సహకార ఉద్యమం అన్ని విధాలుగా ఒక ప్రజా ఉద్యమం. దానికి సంబంధించిన సంస్థలు ఖచ్చితంగా ప్రజల చేతనే నిర్వహించబడాలి".

బ్రిటిష్‌వారి పరిపాలనా కాలంలో అనుసరించబడిన తప్పు విధానాల ఫలితంగా భారతీయ సహకార సంఘాలు స్వశక్తిపై ఆధారపడి పనిచేసే స్వభావాన్ని కోల్పోయాయి. బ్రిటిష్ వారు వెళ్ళిపోయారు. కానివారి పద్ధతులు ఇంకా మనల్ని వదలి పెట్టలేదు. అధికారుల పెత్తనం నుంచి ఉద్యమాన్ని విముక్తి చేయడానికి బదులు, దానిని మరింత ఎక్కువ చేయడానికే నేడు కూడా ప్రయత్నం జరుగుతున్నది అని శ్రీ మాళవీయ పేర్కొన్నారు.

సహకార ఉద్యమంపట్ల ప్రభుత్వ దృక్పథంలో పూర్తిగా మార్పురావాలి ~~అని ఆయన కోరారు~~. సహకార వుద్యమంయొక్క ఆవశ్యకతను ప్రజలు గుర్తించేటట్లు చేసి, వారే సహకార సంస్థలను ఏర్పాటు చేసుకొనేటట్లు ప్రోత్సహించాలి. అందుకు తగిన వాతావరణాన్ని సృష్టించాలి. కేవలం సహకార సంఘాలు రిజిస్టరు అయినంత మాత్రాన ప్రయోజనంలేదు. ప్రజలు సహకారభావాన్ని అలవరచుకొనేటట్లు చేయాలి.

సహకార సంస్థలకు ప్రభుత్వం సహాయం చేయవచ్చు. అంతమాత్రాన దాని వ్యవహారాలను కంట్రోలు చేయడంగాని, తన పలుకుబడిని ఉపయోగించడంగాని పనికిరాదు.

భారతీయ సహకార ఉద్యమం, విదేశాల్లోని సోదర ఉద్యమాలతో సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకోవడం అవసరమని కూడా శ్రీ మాళవీయ అన్నారు.

* * *

ఐక్య అరబ్ రిపబ్లిక్ వాణిజ్య శాఖలో అంతా అరబ్బులనే నియమించే కార్యక్రమం ఈ సంవత్సరాంతానికి పూర్తి అవుతుంది.

విశాలాంధ్ర

చందా దార్లకు విజ్ఞప్తి

చందా చెల్లించి పోస్టుద్వారా తెప్పించుకొనువారు, చెల్లించిన సొమ్మునకు, ఏ తేదీవరకు పత్రిక మీకు వచ్చునో ఆ తేదీ మీకు వచ్చు పత్రిక అడ్రసుపైవేసి యుంటుంది. దీనితోపాటు మీ చందా నెంబరు కూడా వేసి యుంటుంది. దీనిని గమనించి తిరిగి చందా దారులుగా చేరువారు చందా అయిపోవు నాటికి సొమ్ము చెల్లిస్తూ మీ నెంబరు కూడా తెలియజేస్తూ ఉండాలి. ఉత్తరములు వ్రాయునప్పుడు కూడా మీ చందా నెంబరువేసి వ్రాస్తూ వుండాలి.

చందా వివరాలు

పోస్టు ద్వారా

1 సంవత్సరచందా	26-0-0
6 మాసాలకు	13-0-0
3 మాసాలకు	6-75
2 మాసాలకు	4-60
1 మాసానికి	2-30

—మేనేజరు.

చైనా-అమెరికా సంప్రతింపులు

విఫల మొనర్చేందుకు అమెరికా కుతంత్రాలు

హాంకాంగ్, ఏప్రిల్ 12

చైనా, అమెరికాల మధ్య గల కొన్ని అవసర సమస్యల పరిష్కారం నిమిత్తం ఉభయ దేశాల రాయబారుల స్థాయిలో జెనీవాలో జరుగుతూ వచ్చిన సంప్రతింపులు డిసెంబరు నుండి ఆగిపోయాయి.

ఈ సంప్రతింపులు తిరిగి ప్రారంభం కాకుండా చేయడానికి అమెరికా నానావిధ కుతంత్రాలూ పన్నుతున్నదని ఖండిస్తూ చైనా విదేశాంగశాఖ నేడొక ప్రకటన చేసింది.

డిసెంబరుకు ముందు కొన్ని సంవత్సరాలుగా ఈ సంప్రతింపులు కొనసాగినప్పటికీ, అమెరికా వాటిని నిరర్థకం చేస్తూ వచ్చిందనికూడా ఈ ప్రకటనలో తెలిపారు. ఆ సంప్రతింపులు 1955 ఆగస్టులో జెనీవాలో ప్రారంభమయాయి.

లంక భారతీయుల సమస్యపై కమ్యూనిస్టు పార్టీ మహాసభ తీర్మానం

రత్నసింగ్‌నగర్ (అమృతసర్), ఏప్రిల్ 12

లంక భారతీయుల సమస్యను త్వరగా పరిష్కరించాలని లంక ప్రధానిని కోరుతూ భారత కమ్యూనిస్టుపార్టీ మహాసభ నేడొక తీర్మానం చేసింది.

ప్రాంతీయ భాషలకు రాజభాష హోదా

ఈ నెలాఖరున మద్రాసులో సదస్సు ఏర్పాటు

మద్రాసు, ఏప్రిల్ 12

ప్రాంతీయ భాషలను రాష్ట్రాల్లోనూ, హిందీని కేంద్రంలోనూ రాజభాషలుగా ప్రవేశ పెట్టాలనే ప్రతిపాదనను బలపరచేందుకు ఈ నెలాఖరులోగా ఇక్కడ ఒక సదస్సును జరపడానికి నిశ్చయించారు.

ఈ సదస్సు జరిపేందుకు ఏర్పడిన కమిటీకి అధ్యక్షులుగా శ్రీ కె. భాష్యం, ఉపాధ్యక్షులుగా శ్రీయుతులు వేదరత్నంపిళ్ళై, ఏ. యస్. చిన్నాదురై, కార్యదర్శులుగా శ్రీయుతులు టి. పురుషోత్తం, ఎ. ఎన్. వీరరాఘవన్‌గార్లు ఎన్నుకోబడ్డారు.

సదస్సు లక్ష్యాలను తెలియపరుస్తూ ఈకమిటీ తయారుచేసిన ప్రకటనలో యిలావుంది :

దేశ సమైక్యతను కాపాడేందుకు వివిధ రాష్ట్రాలమధ్య సోదరభావాన్ని పెంపొందించుకొనేందుకు వుమ్మడిగా ఒక అధికార భాష వుండటం అవసరం. అలాంటి వుమ్మడిభాష క్రమక్రమంగా ప్రజల సమ్మతిపై పెంపొందుతుంది. ఇప్పుడు మన దేశంలోవున్న భాషలను పరిశీలించితే హిందీని మాట్లాడేవారు నూటికి 42 మంది వున్నారు. అందువలన దానిని జాతీయ భాషగా అభివృద్ధి చేసుకోవడం సముచితంగా వుండగలదు. అంతేగాక, హిందీని ఇంగ్లీషు కంటే తేలిగ్గా నేర్చుకోవచ్చు. అది సామాన్య ప్రజలకు సన్నిహితంగా కూడా వుంటుంది.

ఈ కారణాలవలన హిందీని కేంద్రప్రభుత్వ అధికార భాషగానూ, ప్రాంతీయ భాషలను ఆయా రాష్ట్రాల్లో అధికార భాషలుగానూ వెంటనే ప్రవేశ పెట్టడం అవసరమని ఈ కమిటీ దృఢంగా విశ్వసించుతోంది.

కృశ్చేవ్‌తో భారత రాయబారి భేటీ

మాస్కో, ఏప్రిల్ 12

మాస్కోలోని భారతరాయబారి శ్రీ కె. పి. యస్. మీనన్ ప్రధాని కృశ్చేవ్‌ని కలుసుకున్నారు.

కృశ్చేవ్‌కి నెహ్రూ జాబు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

అణ్వస్త్ర పరీక్షలు మానివేసేందుకు సోవియట్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయానికి తన హర్షం తెలుపుతూ భారత ప్రధాని నెహ్రూ సోవియట్ ప్రధాని కృశ్చేవ్‌కి ఒక లేఖ పంపారని తెలుస్తూంది.

సోవియట్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని తెలియజేస్తూ, ఆ నిర్ణయాన్ని పూర్తిగా బలపరచవలసిందని కృశ్చేవ్ రాసిన జాబుకిది నెహ్రూ జవాబని అనుకుంటున్నారు.

ఉత్తరాఫ్రికాపై ఫ్రెంచిప్రధానికి ఐక్ లేఖ

వాషింగ్టన్, ఏప్రిల్ 12

ఉత్తరాఫ్రికా వ్యవహారాల పట్ల తన ఆందోళనను వెలిబుచ్చుతూ అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఫ్రెంచి ప్రధాని ఫెలిక్స్ గైలార్డ్‌కి ఒక వ్యక్తిగత లేఖను పంపారని ఇక్కడి దౌత్య వర్గాలవలన తెలుస్తూంది. అమెరికా విదేశాంగశాఖ ఉప కార్యదర్శి రాబర్ట్ మర్ఫీ నేడీ జాబును ఫ్రెంచిప్రధానికి స్వయంగా అందజేశారు.

"ఉత్తరాఫ్రికాలో ఫ్రాన్సు ఎదుర్కొంటున్న సమస్యలెంత కష్టమైనవో ఫ్రాన్సు మిత్రుడనయిన నాకు బాగా తెలుసు"నని ఐక్ ఈ లేఖలో అన్నారు.

విదేశ వ్యవహారాలపై పార్లమెంటు కమిటీచర్చ

న్యూఢిల్లీ ఏప్రిల్ 11

పార్లమెంటు విదేశ వ్యవహారాల సలహాసమితితో నేడు ప్రధాని నెహ్రూ విదేశ విధానాన్ని గురించి ఇష్టాగోష్టి చర్చలు జరిపారు. కాశ్మీరుపై గ్రాహం నివేదిక, గోవా సమస్య మున్నగు విషయాలను ఆయన వివరించినట్లు తెలుస్తోంది.

నిరాయుధీకరణ అనేక ఇతర సమస్యలతో ముడిపడివుందని, వీటిని పరిష్కరించవలసింది అగ్రరాజ్యాలు మాత్రమేనని శ్రీ నెహ్రూ చెప్పినట్లు తెలుస్తోంది.

ఇండోనేషియా పరిస్థితిని గురించీ, శిఖరాగ్ర సమావేశ అవకాశాలను గురించీ కూడా ఆయన చర్చించినట్లు తెలుస్తోంది. ఇండోనేషియాలో త్వరలోనే మామూలు పరిస్థితులు నెలకొనగలవని ఆయన ఆశాభావం ప్రకటించారు.

మధ్యయూరప్‌లో అణ్వస్త్ర రహిత మండలం

యూరప్ శాంతిరక్షణకు ప్రధాన చర్య అని చెక్కు, పోలెండు, తూర్పు జర్మనీ విదేశాంగమంత్రుల సంయుక్త ప్రకటన

ప్రాగ్, ఏప్రిల్ 12

మధ్య యూరప్‌లో అణ్వస్త్ర రహిత మండలాన్ని ఏర్పరచాలని పోలెండు చేసిన ప్రతిపాదనను ఆమోదించి, ఆ మండల నిర్మాణానికి హామీ ఇవ్వడంలో సోవియట్‌తో కలిసిరావలసిందిగా పశ్చిమ రాజ్యాలను కోరుతూ చెక్కు, పోలెండు, తూర్పు జర్మనీ విదేశాంగ మంత్రులు నేడిక్కడ ఒక సంయుక్త ప్రకటన చేశారు.

ఈ ముగ్గురు విదేశాంగమంత్రులూ ఇక్కడ రెండు రోజులుగా జరిపిన సమావేశం పూర్తయింది. ఈ సందర్భంలోనే నేడీ సంయుక్త ప్రకటన జరిగింది.

పశ్చిమ జర్మనీ పునరాయుధీకరణకు సాగుతున్న ప్రయత్నాలపట్ల ఈ ప్రకటనలో ఆందోళన వెలిబుచ్చారు. తూర్పు, పశ్చిమ జర్మనీలు, పోలెండు, చెకోస్లోవేకియా దేశాలతో కూడిన మధ్యయూరప్‌లో ఏలాంటి అణ్వాయుధాలూ లేకుండా చూడాలన్న పోలెండు ప్రతిపాదన యూరప్‌లో శాంతిరక్షణకు ఒక ప్రధానమయిన చర్య కాగలదన్నారు.

అణ్వస్త్రాలను సమకూర్చుకోడానికి పశ్చిమ జర్మనీ ఇటీవల చేసిన ప్రయత్నాలు యూరప్‌లో ఉద్రిక్తతను మరింత తీవ్రం చేస్తున్నవన్నారు.

"పోలెండు పథకం అమలు జరగకుండా ఉన్నదంటే దానికి ప్రధాన బాధ్యత పశ్చిమ జర్మనీదే" అని ఈ సంయుక్త ప్రకటనలో ఖండించారు.

ఈ సంయుక్త ప్రకటన వెలువడిన తరువాత పోలెండు తాత్కాలిక విదేశాంగ మంత్రి మిరియన్ నాస్జొవ్స్కీ పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ ఈ పథకం గురించి, ఆసక్తి చూపే దేశాలతో వివరాలను చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే ఈ చర్చలు జరగడానికి ముందు ఆదేశాలు పోలెండుపథకాన్ని ఆమోదించవలసి ఉంటుందన్నారు.

అణ్వస్త్ర ఉత్పత్తి పోటీని అరికట్టేందుకూ, పశ్చిమ జర్మనీలోని యుద్ధోన్మాదులకు అణ్వాయుధాలు సమకూరకుండా చేయడానికీ ఏమి చేయవలసి ఉంటుందో ఆలోచించడానికే ఈ విదేశాంగ మంత్రుల సమావేశం జరిగిందని ఆయన తెలిపారు.

సైప్రస్‌లో టర్కీ కవ్వింపు చర్యలు

నికోసియా, ఏప్రిల్ 10

ప్రస్తుత అరాజక దశలో ఏటర్కీ వానిమీదనైనా రక్తం చిమ్మిందా మొత్తం సైప్రస్ దీవిలో ఆవరించేంత కూడా గ్రీస్ - సైప్రస్ శౌరులకు దక్కదని గ్రీకు పౌరుల్ని హెచ్చరిస్తూ నేడిక్కడ టర్కీ అజ్ఞాత ప్రతిఘటనోద్యమంవారు కరపత్రాలను పంచిపెట్టారు.

"మాకు వ్యతిరేకంగా గ్రీకులు ఏచర్యతీసుకున్నా దాన్ని తిప్పికొడ్తాము"; "సైప్రస్ విభజనో, లేక చావో" అన్న నినాదాలుకూడా ఆ కరపత్రాల్లో వున్నాయి.

టిబెట్‌లో భారత వర్తకుల ఇబ్బందులు

సంప్రతింపుల ద్వారా పరిష్కరించగలమని మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11

టిబెట్‌లో భారతీయ వర్తకులకు గల ఇబ్బందులను గురించి ఢిల్లీలోని చైనా ప్రతినిధులతో సంప్రతింపులను కొనసాగించుతున్నామని నేడు లోక్‌సభలో వాణిజ్య, పరిశ్రమల సహాయమంత్రి శ్రీ కనుంగో తెలియజేశారు. వాస్తవంగాగల ఇబ్బందులేమిటో తెలుసుకొని సంప్రతింపులుజరిపి ఒక సంతృప్తికరమైన పరిష్కారానికి రావాలిగాబట్టి, ఇందుకు ఒకగడువు నిర్ణయించడం సాధ్యంకాదన్నారు.

గుంతకల్లులో అగ్నిప్రమాదం

గుంతకల్లు, ఏప్రిల్ 10

నిన్న సాయంత్రం గుంతకల్లు బెంచికొట్టాలలో నిప్పంటుకొని నాలుగవ తరగతి రైల్వేకార్మికుల పాకలు 15 కాలిపోయాయి. అగ్ని మాపకదళంవారు మంటలను ఆర్పివేశారు.

సోదరకార్మికులు ఒక కమిటీగా ఏర్పడి నిరాశ్రితులకు తాత్కాలిక సహాయం అందజేశారు.

పెదపుత్తేడు పంచాయితీ ఉపఎన్నికల ఫలితం

ఉప్పలపాడు, ఏప్రిల్ 10

కోవూరు తాలూకా పెదపుత్తేడు పంచాయితీ ఉపఎన్నికలలో కమ్యూనిస్టుపార్టీ బలపరచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

వారిపేర్లు ఇవి: శ్రీ కొల్లారెడ్డి దశరథరామిరెడ్డి, శ్రీ పలకొల్లు వెంకయ్య.

ఇండ్లపన్ను కట్టకుండా ఎన్నికైన ఇద్దరు సభ్యుల పదవులను ఇటీవల కోర్టువారు రద్దుచేశారు. తత్ఫలితంగా ఈ రెండు స్థానాలకు ఏప్రిల్ 7 వ తేదీన ఉపఎన్నికలు జరిగాయి.

* * *

పరిశ్రమల్లో సర్వోదయ పద్ధతులను ప్రవేశపెట్టే సమస్యను గురించి శ్రీ ఢేబర్ బొంబాయిలో సర్వోదయ కార్యకర్తలతోనూ పారిశ్రామిక వేత్తలతోనూ చర్చలు జరిపారు.

సామర్లకోట మున్సిపల్ ఎన్నికలు

సామర్లకోట, ఏప్రిల్ 11

సామర్లకోట మునిసిపల్ ఎన్నికలు మే నెల 28 వ తేదీన జరుగుతాయని తెలుస్తున్నది.

1956 అక్టోబర్‌లో సామర్లకోట పంచాయితీని మునిసిపాలిటీగా ప్రకటించారు. అప్పటినుండి స్పెషల్ ఆఫీసరు పరిపాలన సాగుతున్నది.

శ్రీ పాయ్‌తో ఎన్. జీ. వో. ల భేటీ

హైదరాబాదు, ఏప్రిల్ 12

ఏప్రిల్ 16 వ తేదీన మూకమ్మడిగా సెలవుపెట్టాలని నిర్ణయించిన ఆంధ్రప్రదేశ్ ఎన్. జీ. వో. సంఘం ప్రతినిధులు నేడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. పి. పాయ్‌ని కలుసుకొన్నారు.

తర్వాత వారి ప్రతినిధి ఒకరు పత్రికలవారితో మాట్లాడుతూ వేతనాల సంఘాన్ని నియమించాలన్న కోర్కెను ప్రభుత్వం పరిశీలించగలదని శ్రీ పాయ్ చెప్పారన్నారు. ఎన్. జీ. వోలు తమ నిర్ణయాన్ని గురించి తిరిగి ఆలోచించి ఏప్రిల్ 16 న ముఖ్యమంత్రిని కలుసుకోవలసిందిగా పాయ్ సలహా ఇచ్చారన్నారు.

జిల్లా కేంద్రాలను సంప్రదించి తమ నిర్ణయంపై తిరిగి ఆలోచన చేస్తామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రిని ఏప్రిల్ 16 లోగా కలుసుకొనడానికి ఏర్పాటుచేస్తే బాగుంటుందని తానూ శ్రీ పాయ్‌తో చెప్పామన్నారు.

కార్మిక - యజమాని సంబంధాలు

కాన్పూరు, ఏప్రిల్ 12

దేశంలో కార్మికులు- యజమానుల మధ్య సత్సంబంధాలు నెలకొనకపోతే ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మనం చేసే పథకాలు, సోషలిస్టు సమాజనిర్మాణం కోసం చేసే సన్నాహాలూ అన్నీ వమ్ము కాగలవని యు. పి. గవర్నరు శ్రీ వి. వి. గిరి కాన్పూరు రోటరీ క్లబ్బువారిచ్చిన ఒక విందులో ప్రసంగిస్తూ చెప్పారు.

పరిశ్రమల్లో వున్నవారు దేశానికి ధర్మకర్తలు. యజమాని - కార్మిక సంబంధాలలో ఏమాత్రం కొరత ఏర్పడినా దానివల్ల మన ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది అనిఆయనఅన్నారు.

ఒక పరిశ్రమకు ఒకే కార్మిక సంఘం వుండవలసిన అవసరాన్ని గురించి ఆయన నొక్కి వక్కాణించారు.

మూలవ్యాధి నివారిణి
సమూలంగా నివారణ. ఆపరేషను అక్కర్లేదు. 1 మోతాదుకే అద్భుతంగా బాధనివారణ. 4 ఔ॥ సీసా రు. 7-25
ది హేపీ హోం ఇండస్ట్రీస్ & సప్లైస్,
భీమవరం. (ప॥ గో॥ జిల్లా.)

ఇంజన్ అమ్మకము
బ్లాక్‌స్టోన్ ఇంజను - 16 హెచ్. పి. 4" నిడివిగల శ్రీరాం వాటర్‌పంపుతోసహా.
వివరములకు : బాక్సు నెం. 26.
C/o విశాలాంధ్ర, విజయవాడ.

నసీమ్ లవెండర్ బ్రిలియన్‌టైన్
ఒత్తయిన జుత్తుకు
హమీ & కో
బొంబాయి-2

గ్రామ పంచాయితీ, సహకార సంఘం పాఠశాల - ఇవే మన సామాజిక వ్యవస్థకు మూల స్తంభాలు

సహకార మహాసభలో ప్రధాని నెహ్రూ ప్రసంగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

గ్రామ పంచాయితీ, గ్రామ సహకార సంఘం, గ్రామ పాఠశాల—ఈ మూడు ప్రధాన స్తంభాలను ప్రాతిపదిక చేసుకొని భారత రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థను నిర్మించుకోవాలని ప్రధాని నెహ్రూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

అఖిల భారత సహకారసంఘ మూడవ మహాసభను శ్రీ నెహ్రూ ప్రారంభోత్సవం జరుపుతూ ఇంకా ఇలా అన్నారు :

మనం సహజంగా పై అంతస్తులో వున్న పెద్దవిషయాలను దృష్టిలో వుంచుకొని ఆలోచించుతాం. పైన సర్వస్వతంత్ర సంస్థగా పార్లమెంటు వుంది. అది దేశానికంతటికి అవసరమైన శాసనాలను రూపొందించుతూ భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది. ఇది మనం మూలంగా అనుకొనే విషయం. పార్లమెంటు ముఖ్యమైనదే. అయితే ఈ పార్లమెంటుకు పునాది ఏమిటి? ఆ పునాది నుంచే పార్లమెంటుకు ఈ ప్రాధాన్యత వస్తుంది.

భారత దేశానికి నేడు పునాది గ్రామాలే. పునాదిగావున్న ఈ గ్రామాల బలం లేకపోతే పార్లమెంటు గాలిలో ఎగురుతుంది.

సహకార ఉద్యమ భావం తనను ఎంతగానో ఉత్తేజపరుస్తుందని శ్రీ నెహ్రూ అన్నారు. ఈఉద్యమంలో తాను వ్యక్తిగతంగా పాల్గొనక పోయినప్పటికీ, వెనుక వున్న సిద్ధాంతం దాని సాంఘిక ప్రయోజనం తనకు ఎంతగానో నచ్చిందన్నారు. వివిధ రకాల అతివాద కార్యాచరణలకు సహకార ఉద్యమం అతీతంగా వుండగలదన్నారు.

అభ్యుదయకరమైన వ్యవసాయ ఆర్థిక విధానం మనం అనుసరించని పక్షంలో, రోజురోజుకు మన సృజనాత్మకశక్తి పెంపొందనిదే భారత దేశం పారిశ్రామికవంతం కావడం సాధ్యపడదని శ్రీ నెహ్రూ స్పష్టపరిచారు.

ఒకవైపున మన దేశాన్ని పారిశ్రామికవంతం చేయాలని చెపుతూనే, మరొకవైపున కుటీరపరిశ్రమలను, గృహపరిశ్రమలను పెంపొందించుకోవాలని భారత దేశంలో మనం అంటున్నాం. ఈ వైఖరిని చూసి చాలమంది ఆశ్చర్యం వెలిబుచ్చుతున్నారు. ఈ రకమైనఆలోచనపురాతనమైన పద్ధతుల ననుసరించి లేదా అని ప్రశ్నించుతున్నారు. అయితే ఈ విషయంలో నేను వివాదంలోకి దిగదలచలేదు. నేను భారతదేశంలో వున్న పరిస్థితులనుబట్టి ఈ విధానమే సరియైనదని నేను భావిస్తున్నాను. ఇతరదేశాల్లో జరిగిన దాన్ని గుడ్డిగా అనుసరించడానికి యత్నించడం ప్రమాదకరం.

ప్రధాని నెహ్రూ అంతకుముందు సహకార ఉద్యమాన్ని గురించి మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్యాన నిర్వహించబడే సహకార సంఘాలు తీరని నష్టాన్ని కలుగజేస్తున్నాయని అన్నారు. తమ స్వయం శక్తిపై ఆధారపడాలనే భావాన్ని ప్రజల్లో అవి చంపుతుంది. ప్రతిదానికీ ప్రభుత్వం వంకచూసే ధోరణిని అలవాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం సహకార సంఘాలకు సహాయపడవలసిందేకాని, వాటిపై పెత్తనం చేయరాదన్నారు.

సహకార వ్యవసాయ విధానం వాంఛనీయమంటూ శ్రీ నెహ్రూ ఇలా అన్నారు :

నేను వ్యవసాయ దారుడినికాను. అందువలన సిద్ధాంతరీత్యా మాత్రమే నేను మాట్లాడగలను. కాని భారతదేశంలోని హెచ్చుభాగంలో మనం సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలనే నిర్ణయానికి తప్పనిసరిగా రావలసి వస్తుంది. అయితే వ్యక్తిగత యాజమాన్యం వుండవచ్చు. అందరూ కలసి సహకార పద్ధతిలో ఉమ్మడి వ్యవసాయం చేసుకోవాలనేదే నా భావం.



ఆరోగ్యం క్షీణించిపోయే హెచ్చరిక చిహ్నాలు కనిపించినప్పుడు సరియైన రక్షణ తీసుకోడానికి బోలెడంత వ్యవధి వుంది. ఉదాహరణకు కొద్దిగా బరువు పోయినా, వ్రణంలాగా పెద్దదవుతూన్న పుండూ యివన్నీ ఆరోగ్యానికి అపాంతరాలే.
ఈ హెచ్చరికను పెడచెవిని పెట్టకుండా వినండి. ఎప్పుడో మంచి కలుగుతుంది. అనే ఆశతో కాలాన్ని వృథా చేయకండి. తయ్యా, తయ్యాటి కబుర్లు చెప్పినప్పటికీ అసమర్థులైన వారి సలహాల కొరకు ఎదురు చూడకండి.
స్వంత వైద్యం అంతకన్నా చేయవద్దు. సరియైన, తక్షణ వైద్య చికిత్స, ఒక్క బాధ నివారణనుండే కాక ఘోర మృత్యువునుండి రక్షిస్తుంది. కాలం మీకు అప్పుగా వుంది. గుర్తుంచుకోండి. మొట్టమొదటిసారిగా మీ డాక్టర్లను చూడవలసిన సమయం, మొదటిసారిగా అపాయకర చిహ్నాలు కనిపించిన తక్షణమే. తరువాత గడచిపోయిన అమూల్యమైన కాలం తిరిగి రాదు.
మీ డాక్టరు సలహా అడగండి
Alembic అలెంబిక్ కెమికల్ వర్క్స్ కో. లి., బరోడా-3.
ACW-57-5 TL. EVEREST,

సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (అధ్యక్షుడు); కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరుబలరామమూర్తి - ఎడిటర్, ప్రింటర్ & పబ్లిషర్ : విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆఫ్ట్ ప్రింటర్స్, విజయవాడ-2.